

యోగాభ్యాసంతో ఆరోగ్య ప్రయోజనాలు



యోగాసనం వేస్తున్న యువతి

కాకినాడ,జూన్16(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ కనీసం నెలరోజులైనా యోగాభ్యాసాన్ని నిత్యం కొనసాగించి ఆరోగ్య ప్రయోజనాలు పొందాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఉదయం కాకినాడ జీఆర్‌టీ గ్రాండ్ హోటల్‌లో ఆయుష్‌శాఖ, జీఆర్‌టీ హోటల్ సంయుక్త ఆధ్వర్యంలో కాకినాడ పరిధిలోని జిల్లా అధికారులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి యోగా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా

» జిల్లా అధికారుల యోగా శిక్షణలో డీఆర్‌వో

డీఆర్‌వో వెంకటరావు మాట్లాడుతూ యోగాంధ్ర జూన్ 21న ఉన్నందున గతనెల 21నుంచి రాష్ట్ర జిల్లాస్థాయిలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం యోగాచార్య చిట్టిబాబు వివిధ యోగాసనాలు, ప్రాణాయామ ప్రక్రియల శిక్షణ నిర్వహించారు. వాటి సాధనవల్ల కలిగే ఆరోగ్యం ప్రయోజనాలను వివరించారు. బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు ధ్యానం, రాజయోగం అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యులు డాక్టర్ మహ్మద్



కాకినాడలో యోగాసనాలు వేస్తున్న డీఆర్‌వో వెంకట్రావు, ఇతర జిల్లా అధికారులు

షాహిద్ అలీ, జీఆర్‌టీ గ్రాండ్ హోటల్ జీఎం శివకృష్ణ, సేల్స్‌మేనేజర్ అనిత, జిల్లాఅధికారులు, యోగాగురువులు పాల్గొన్నారు. యోగా ప్రదర్శన చేసిన సాత్విక అందరి మన్ననలు పొందారు.

జలామృత్!

పట్టణాలకు అమృత్ నిధులు



(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

పట్టణాలు,నగరాల్లో తాగునీటి సరఫరా మెరుగుదల, మురుగునీటి శుద్ధి ప్రాజెక్టుల నిర్వహణకు పుష్కలంగా నిధులు విడుదలయ్యాయి. కేంద్రం అమృత్-2.0 పథకం ద్వారా ఇచ్చిన నిధులు సద్వినియోగపరచుకుంటూ రాష్ట్ర వాటా విడుదల చేస్తూ పనులు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గత వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్థానిక సంస్థల వాటా విడుదల చేయకపోవడంతో పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వీటన్నింటికి తిరిగి అంచనాలు రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రూ.867.73 కోట్లు నిధులు మంజూరు చేయడంతో మూడు నెలల్లోగా టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

అసలేం చేస్తారు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తాగునీటి సరఫరా వ్యవస్థ పురాతనమైనది. దీంతో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలు చోట్ల ప్రస్తుతం ఉన్న తాగునీటి ప్రాజెక్టుల కెపాసిటీ సరిపోవడం లేదు. పెరిగిన జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరా వ్యవస్థను ఆధునీకరించడం, పైపులైన్ల ఏర్పాటుతో పాటు మురుగునీటి శుద్ధి ప్రాజెక్టులు, కొత్తగా మురుగునీటి పారుదల నెట్‌వర్క్‌ల ఏర్పాటుకు కేంద్రం అమృత్ పథకం ద్వారా నిధులు కేటాయిస్తోంది.ఇందులో కేంద్రంతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చడంతో పాటు ఈ ప్రాజెక్టులు అమలయ్యే పట్టణ స్థానిక సంస్థలు తమ వాటా భరించాలి. 15వ ఆర్థిక సంఘం నిధులు అదనంగా వెచ్చించాల్సి ఉంటుంది.

కూటమి ప్రభుత్వం దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమృత్-2.0 పథకం నిధులు వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించింది. కేంద్రంతో సంప్రదింపులు జరిపి తమ వాటా విడుదలకు అంగీకారం తెలపడంతో నిధులు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ లభించింది.ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రెండు కార్పొరేషన్లు, ఎనిమిది మునిసిపాలిటీలు,మూడు నగరపంచాయతీలకు 867.73 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ వాటర్ యాక్షన్ ప్లాన్ ట్రెంచ్ 1,2 ద్వారా కన్సెషనరీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(చామ్)లో నిర్వహించేందుకు ఆదేశాలివ్వడంతో అన్ని పనులు మూడు నెలల్లోగా ప్రారంభించాలని ఆదేశించింది. పనులు 24 నెలల్లోపు పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్దేశించింది.ఈ పనులు పూర్తయితే పట్టణాలు, నగరాల్లో తాగునీటి సరఫరా మెరుగుపడి.ప్రజలకు తాగునీరందుతుందని భావిస్తున్నారు.

వైసీపీలో ఎక్కడివి అక్కడే..

వైసీపీ ప్రభుత్వం అమృత్-2.0 పథకం నిధులు వినియోగించుకోవడంలో పూర్తిగా విఫలమైంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో అమృత్ నిధులు కేంద్రం మంజూరు చేసింది. దీంతో పట్టణాలు,నగరాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి వీలు ఏర్పడుతుందని భావించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోగా కేంద్రం ఇచ్చిన నిధులు ఇతర అవసరాలకు దారి మళ్లించారు. మంజూరైన పనుల్లో కొన్నింటిని మాత్రమే ప్రారంభించారు.వాటికి పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాకపోవడం,స్థానిక సంస్థల నిధులను అప్పటి వైసీపీ ప్రభుత్వం తన ఆధీనంలో ఉంచుకోవడంతో పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. మెజార్టీ పనులు ప్రారంభమే కాలేదు.

» తీరనున్న తాగునీటి వెతలు
» పట్టణాల్లో ప్రాజెక్టులకు మోక్షం
» ఉమ్మడి జిల్లాకు రూ.867 కోట్లు
» అమృత్ 2.0 పథకంలో మంజూరు
» చామ్ మోడల్‌లో పనులు
» వైసీపీలో నిధులు మళ్లింపు
» మూడు నెలల్లో టెండర్లకు పిలుపు

కాకినాడకు రూ.498.16 కోట్లు

కాకినాడ జిల్లాకు రూ. 498.16 కోట్లు విడుదలయ్యాయి. పిఠాపురం పట్టణంలో తాగునీటి సరఫరా మెరుగుదల ప్రాజెక్టుకు రూ.57.37 కోట్లు, పెద్దాపురం పట్టణ పరిధిలో నీటి సరఫరా ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టుకు రూ. 36.21 కోట్లు, తిరుపతిరాజు చెరువు ఆధునీకరణకు రూ.61 లక్షలు, పాత ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని పెద్ద చెరువు ఆధునీకరణకు రూ.90 లక్షలు, సామర్లకోట పట్టణ పరిధిలో తాగునీటి సరఫరా ఇంప్రూవ్‌మెంట్ పథకానికి రూ. 38.98 కోట్లు, గొల్లప్రోలు పట్టణంలో ఆర్థికంగా వెనుకబడిన కాలనీల తాగునీటి సరఫరా పథకానికి రూ. 2.16 కోట్లు, మంచినీటి చెరువు అభివృద్ధికి రూ.4.10 కోట్లు, తుని పట్టణంలో వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ పథకానికి రూ.15.04 కోట్లు, ఏలేశ్వరం నగరపంచాయతీలో కప్పల చెరువు ఆ ధునీకరణకు రూ.74 లక్షలు మంజూరయ్యాయి. కాకినాడ నగరంలో తాగునీటి సరఫరా మెరుగుదల ప్రాజెక్టుకు రూ. 256.48 కోట్లు మంజూరు కాగా, నగర పరిధిలో మురుగునీటి పారుదల నిర్వహణకు రూ.82.87 కోట్లు, బోట్‌క్లబ్ పార్కు ఆధునీకరణకు రూ.2.70కోట్లు విడుదల చేశారు.

తూర్పునకు రూ. 296.83కోట్లు

రాజమహేంద్రవరం,నిడదవోలు మునిసిపాలిటీలకు రూ.296.83 కోట్లు మంజూరయ్యాయి.రాజమహేంద్రవరంలో మురుగునీటి పారుదలకు రూ.92.78 కోట్లు, వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ స్కీమ్‌కు రూ.95.14 కోట్లు, కంబాలచెరువు ఆధునీకరణకు రూ.3.70 కోట్లు,గంటాలమ్మ చెరువు ఆధునీకరణకు రూ.కోటి,గోదావరి వద్ద పనులకు రూ.7.20 కోట్లు, ఆర్యాపురం ట్యాంకు ఆధునీకరణకు రూ.3.20 కోట్లు విడుదలయ్యాయి. నిడదవోలుకు ధవళేశ్వరం నుంచి గోదావరి జలాల సరఫరాకు రూ.83.82 కోట్లు, నిడదవోలు వీకర్ సెక్షన్ కాలనీ తాగునీటి సరఫరాకు రూ5.96 కోట్లు, మలకోడు చెరువుకు రూ.93 లక్షలు,వేస్ట్ వాటర్ ట్యాంకు ఆధునీకరణకు రూ. 3.60 కోట్లు మంజూరు చేశారు.

కోనసీమకు రూ.72 కోట్లు

కోనసీమ జిల్లాకు రూ.72.74 కోట్లు కేటాయించారు.అమలాపురం వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టుకు రూ. 11.51 కోట్లు, రామచంద్రపురం తాగునీటి సరఫరా మెరుగుదల ప్రాజెక్టుకు రూ.15.20 కోట్లు, రామచంద్రపురంలో చెరువు ఆధునీకరణకు రూ.1.10 కోట్లు,మండపేట వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టుకు రూ.29.02 కోట్లు, ముమ్మిడివరంలో తాగునీటి సరఫరా మె రుగుదలకు రూ.15.91 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

పింఛన్.. టెన్షన్!



కొత్త వితంతు పింఛన్ల పంపిణీ ఎప్పుడో

సామర్లకోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏం చేసినా అందులో ఒక పరమార్థం ఉంటుంది.లోతుగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్నారు. సూపర్ సిక్స్ హామీల అమల తీరులోనూ ఇదే విధానం అవలంబిస్తున్నారు. ఏ పథకమైనా నిరంతరం కొనసాగాలనే దిశగా ఆలోచన చేస్తున్నారు. స్పౌజ్ పింఛన్ల పంపిణీది అదే పరిస్థితి. 2023 డిసెంబరు నెల ఒకటో తేదీ తర్వాత భర్త చనిపోతే భార్యకు ఎన్టీఆర్ భరోసా పథకం స్పౌజ్ పింఛను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఈ మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 8,541 కొత్త పింఛన్లు మంజూరు చేశారు.ఈ నెల మొదటి వారంలోనే వీటిని పంపిణీ చేయాల్సి ఉంది. ఈ నెల 12వ తేదీకి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటడంతో స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేస్తారని ప్రకటించారు. అయితే వాయిదా పడింది.ఇప్పటివరకూ కొత్త పింఛన్ల పంపిణీ చేపట్టలేదు.భర్త చనిపోయిన భార్యకు మాత్రమే వితంతు పింఛను ఇవ్వాలని నిర్ణయించింది.ఎప్పుడిస్తారో ప్రకటించలేదు.

గత ప్రభుత్వంలో ఇలా..

గత ప్రభుత్వంలో పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే ఆ పింఛన్‌ను భార్యకు మంజూరు చేసేందుకు నెలల సమయం తీసుకునేది. ఏళ్లు గడుస్తున్నా ఆ కుటుంబంలోని భార్యకు లేదా ఇతర అర్హులైన బంధువులకు పింఛన్ మంజూరయ్యేది కాదు.. ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వంలో పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే ఆ మరుసటి నెల నుంచే భార్యకు ఫించన్ ఇస్తున్నారు.2023 డిసెంబర్ ఒకటో తేదీ తరువాత నుంచి భర్త చనిపోయినవారికి కూటమి ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసింది.

» ఈ నెల 12న ఇస్తారని వాయిదా
» పంపిణీపై అయోమయం
» మహిళల ఎదురుచూపులు
» 8,541 మందికి అర్హత
» పంపిణీకి రూ.3.41 కోట్లు
» ఉమ్మడి జిల్లాలో ఇదీ లెక్క



8,541 మంది ఎంపిక..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 8,541 మందికి కొత్తగా ఈనెల నుంచి పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వీరికి నెలకు రూ.4 వేల చొప్పున రూ.3 కోట్ల 41 లక్షల 24 వేలు ప్రతినెలా ప్రభుత్వంపై అదనపు భారం పడనుంది.ఇలా రాష్ట్రవ్యాప్తంగా 89,788 మంది వితంతువులకు ఈ నెల 12న పంపిణీ చేయాల్సిన పింఛన్లు అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది.ఈ నెలలోనే లబ్ధిదారులకు అందజేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. కాకినాడ జిల్లాలో 3,118 మందికి కొత్తగా స్పౌజ్ పింఛన్లు మంజూరు చేయగా రూ.1కోటి 24 లక్షల 72 వేలు మేర అదనపు భారం పడనుంది.అంబేడ్కర్ కోనసీమ జి ల్లాలో 2,824 మందికి కొత్తగా స్పౌజ్ పిం ఛన్లు మంజూరు కాగా రూ.1 కోటి 12 లక్షల 56 వేలు అదనపు భారం పడనుంది. తూ ర్పుగోదావరి జిల్లాలో 2,599 మందికి కొత్తగా స్పౌజ్ పింఛన్లు మంజూరు కాగా రూ.1కోటి 3 లక్షల 96 వేలు అదనపు భారం పడనుంది.

అర్జీలను సంతృప్తికరంగా పరిష్కరించాలి



» జిల్లా కలెక్టర్ షాన్ మోహన్

అర్జీదారుల సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జూన్16(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారం అందివ్వాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ వివేకానందహాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిష్కరించిన దరఖాస్తులను జిల్లా అధికారి ఆడిటింగ్ చేయాలని సూచించారు. జిల్లాస్థాయి అధికారి ఆడిట్ చేసి నివేదిక పంపించిన తర్వాత వాటిని రాష్ట్రస్థాయిలో ఆ డిట్‌కి పంపిస్తామన్నారు. వివిధ అంశాలకు సంబంధించి మొత్తం 681 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, సీపీవో త్రినాథ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పెద్దిరాజు, డీపీవో రవి కుమార్ పాల్గొన్నారు.

ఎస్పీ ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 71 అర్జీలు



అర్జీదారుడి గోడు వింటున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారి సమస్యలను స్థానికంగా పరిష్కరించకుంటే చర్యలు తప్పవని ఎస్పీ జి.బిందుమాధవ్ పోలీస్ అధికారులను హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు జిల్లావ్యాప్తంగా 71మంది అర్జీదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ అర్జీదారుల సమక్షంలోనే పోలీస్ అధికారులతో వీసీ నిర్వహించి అర్జీదారుల ఫిర్యాదులు సమ్మతమైనవైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ఫిర్యాదుదారులు సంబంధిత పోలీస్‌స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాల్లోను సబ్ డివిజన్ కార్యాలయాలలోను ఫిర్యాదు చేయవచ్చన్నారు.

కార్యాలయాల చుట్టూ తల్లిదండ్రుల పడిగాపులు



పిఠాపురంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల పడిగాపులు

పిఠాపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అన్ని అర్హతలు ఉన్నా తల్లికి వందనం సొమ్ములు పడని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. సాంకేతిక, ఇతర కారణాలతో ఖాతాలకు డబ్బులు జమ కాకపోవడంతో వారు వార్డు, గ్రామ సచివాలయాలు, విద్యుత్‌శాఖ ఆఫీసుల వద్ద పడిగాపులు పడుతున్నారు.

తల్లికి వందనం పథకం కింద వివిధ కారణాలతో సొమ్ములు పడని వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఏఏ కారణాలతో తల్లికి వందనం సొమ్ములు పడలేదో వాటికి సంబంధించిన ఆధారాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో సచివాలయాలకు వచ్చి కారణాలపై ఆరా తీస్తున్నారు. సొమ్ములు పడని వారిలో ఎక్కువ మందికి నెలసరి విద్యుత్ వినియోగం 300 యూనిట్లు కంటే అధికంగా ఉన్నట్లు రిమార్కుల్లో చూపించారు. దీంతో వారంతా విద్యుత్‌శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. తమ వినియోగం ఎప్పుడూ 300 యూనిట్లు దాటలేదని, ఒకటి, రెండు నెలలు మాత్రమే దాటిందని, ప్రభుత్వం సూచించిన విధంగా 12నెలల సగటు వినియోగం చూసుకుంటే తక్కువ ఉందంటూ వారు జిల్లాలోని ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలోని అధికారులను సంప్రదిస్తున్నారు. ఇదే రీతిలో పిఠాపురంలోని ఎలక్ట్రికల్ ఆఫీసుకు తల్లిదండ్రులు భారీగా తరలివచ్చారు. 300యూనిట్ల కంటే అధికంగా వినియోగం ఉందన్న కారణంగా చూపించిన వారు 12నెలల సగటు వినియోగంపై సంబంధిత అధికారులు సర్టిఫికెట్లు తీసుకురావాలని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు మాత్రం తమవద్ద ఆరునెలల వివరాలు మాత్రమే అందుబాటులో ఉంటాయని, ఏడాదికాలానికి కావాలంటే దరఖాస్తు చేసుకున్న తర్వాత వారంరోజుల్లో ఇస్తామని తెలిపారు. అప్పటివరకూ ఆగితే దరఖాస్తు గడువు ముగిసిపోతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల్లో నేరుగా విద్యుత్‌శాఖ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి ఏడాది సగటు తీసుకునేలా అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు. మరోవైపు పలువురికి ఆదాయం పన్ను చెల్లింపుదారులని, వేయి చదరపు అడుగుల విస్తీర్ణం కంటే ఎక్కువగా ఉన్న భవనం ఉందని, నాలుగు చక్రాల వాహనం ఉందని కారణాలుగా చూపుతున్నారు. గృహరుణాలు, ఇతరత్రా అవసరాల నిమిత్తం ఆదాయపు పన్ను రిటర్న్‌లు వేసిన వారికి ఇప్పుడు తల్లికి వందనం అందకుండా పోయింది. ఇటువంటి వారి దరఖాస్తులను సైతం సచివాలయ సిబ్బంది స్వీకరించకపోవడంపై తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు హౌస్ మ్యాపింగ్‌లో లోపాలు తల్లిదండ్రులకు శాపంగా మారాయి.

» విద్యుత్‌శాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
» సచివాలయాల్లో ఫిర్యాదులు
» 'తల్లికి వందనం' కోసం ఇన్ ఎలిజిబిల్ లిస్టులోని వారి వినతులు



తరలిన తల్లిలోకం!

తల్లిలోకం ఒక్కసారిగా కదిలింది.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన తల్లికి వందనం సొమ్ములు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. వాటిని తీసుకోవడానికి బ్యాంకులు, పోస్టాఫీసులకు మహిళలు ఇలా క్యూ కట్టి.. మాకు డబ్బులు పడ్డాయేమో చూడండంటూ ప్రాధేయపడుతున్నారు. 5

బదిలీల సిఫార్సులపై కలెక్టర్ ఆరా

జీజీహెచ్(కాకినాడ), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ బదిలీల్లో ప్రయోజనాలు పొందేందుకు నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికల్లో ఎన్నికైన వారి పేర్లకు బదులు ఎంపిక కాని వారిని చేర్చడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్‌డీ డాక్టర్ పద్మాశశిధర్‌ను వివరణ అడిగారు. పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆర్‌డీ వివాదానికి సంబంధించిన అంశాలను కలెక్టర్‌కు అందజేశారు. ఉన్నతాధికారులను బురిడీ కొట్టిస్తున్న ఇటువంటి వ్యవహారాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. దీనిపై ఆర్‌డీని వివరణ కోరగా కలెక్టర్ సూచనల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

గృహాలపై సోలార్ ప్యానల్ ఏర్పాటు చేయాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామీణ ప్రాంతాలతోపాటు అర్బన్ ప్రాంతాల్లో పీఎం సూర్యఘర్ పథకం కింద లబ్ధి గృహాలపై సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్ ఏర్పాటు చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకం, రిజిస్ట్రేషన్ పురోగతి, డ్వాక్రా మహిళలకు స్త్రీనిధి రుణాలు మంజూరు వంటి అంశాలపై సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ ప్యానల్ ఏర్పాటుకు బ్యాంకర్ల ద్వారా రుణం మంజూరు ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో ఏపీఈపీడీసీఎల్‌ఎస్‌ఈ ప్రసాద్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసురావు, మెప్మా పీడీ ప్రియంవద, ఎల్డీఎం ప్రసాద్, ఏపీవోలు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు భరోసా

పిల్లల చదువు కోసం తపన పడే తల్లిదండ్రులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఈ మేరకు 'స్త్రీ నిధి' ద్వారా స్వల్ప వడ్డీకే రుణాలు అందించే కార్యక్రమానికి చర్యలు చేపట్టింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు అతి తక్కువ వడ్డీతో విద్యా రుణాలు అందించే ఏర్పాటు చేస్తోంది.





- పిల్లల చదువుల కోసం 4 శాతం (35పైసలు) వడ్డీకే స్త్రీ నిధి రుణం
- 'ఎన్టీఆర్ విద్యా సంకల్పం'గా అమలు చేయాలని నిర్ణయం
- త్వరలో అందించేందుకు కూటమి సర్కారు సిద్ధం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పిల్లల చదువులు తల్లిదండ్రులకు భారంగా మారుతున్నాయి. స్కూలు, కాలేజీ ఫీజుల చెల్లింపు, పుస్తకాలు, యూనిఫామ్ కొనుగోలు, అదనపు కోర్సులు, ఇతరత్రా ఖర్చులు పెరుగుతుండడంతో ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలో వారు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. ఉన్నత చదువులన్నీ దాదాపు ఖర్చుతో కూడుకున్నవే కావడంతో చాలా మంది బయట అధిక వడ్డీలకు అప్పులు చేసే పరిస్థితి ఉంది. ఇలాంటి వారికి అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓ కొత్త పథకానికి శ్రీకారం చుడుతోంది. స్త్రీ నిధి ద్వారా పొదుపు మహిళల పిల్లల చదువు కోసం తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 'ఎన్టీఆర్ విద్యా సంకల్పం' పేరిట ఈ రుణాలను అందించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో కేవలం 35 పైసల వడ్డీకి రెండేళ్ల నుంచి మూడేళ్ల కాలపరిమితిపై అందించనున్నారు. రుణం పొందిన వారు కేజీ నుంచి పీజీ వరకు చదివే తమ పిల్లల విద్య కోసం మాత్రమే దీనిని ఖర్చు చేయాలి. అవసరమైతే వారికి సైకిళ్ల కొనుగోలుకు, చదువుకు సంబంధించి పరీక్ష ఖర్చుకు వినియోగించుకోవచ్చు. అధికారులు అడిగితే ఖర్చుకు సంబంధించిన రసీదులు చూపించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు వర్తింపజేయనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా త్వరలో ఈ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చేలా అధికారులు కసరత్తు పూర్తి చేశారు.

కాకినాడ జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 2,89,779 మంది ఉన్నారు. 38వేల మహిళా స్వయం సహాయక సంఘాలు ఉండగా అందులో 38 వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. విద్యార్థుల్లో 80 శాతానికిపైగా పొదుపు సంఘాల పరిధిలోని కుటుంబాల వారే. ఇందులోనూ మూడొంతులకు పైగా పేద, నిరుపేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారే. వీరందరూ కూడా తమ పిల్లల చదువుల కోసం స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకోవచ్చు. జిల్లాలో ఏటా స్త్రీ నిధి ద్వారా 28వేలమంది సభ్యులు రూ.253 కోట్లు వరకు రుణాలు పొందుతున్నారు.

హాయి హాయిగా..


శోభాయమానంగా ఉన్న చెట్లు

- మోతుగూడెంలో ఇరువైపులా పచ్చదనంతో ఆహ్లాదకరంగా రహదారులు

మోతుగూడెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో చిగురించిన చెట్లతో మన్యం ఆహ్లాదకరంగా మారింది. నాలుగు రోజులుగా వాతావరణ మార్పు.. చిరుజల్లులు పడుతుండడంతో పచ్చదనంతో శోభాయమానంగా మారింది. మోతుగూడెం-గొడ్లగూడెం మధ్య రహదారులు ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వాహనచోదకులు చల్లటి వాతావరణంలో ప్రయాణిస్తూ చక్కటి అనుభూతి పొందుతున్నారు.

'విసిరి'తే పతకమే!


సాధించిన పతకాలతో లక్ష్మీ వేద సంహిత

- షాట్‌పుట్‌లో రాణిస్తున్న కాకినాడ యువతి లక్ష్మీ వేద సంహిత
- సీనియర్ అథ్లెటిక్స్ స్టేట్ మీట్‌లో బంగారు పతకం కైవసం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జగన్నాథపురం చర్చి స్క్వేర్ సమీపంలోని పచ్చిపులుసు వారి వీధిలో నివసిస్తున్న పి.చంద్రశేఖరరావు-అన్నపూర్ణ దంపతుల కుమార్తె లక్ష్మీ వేద సంహిత అథ్లెటిక్స్‌లో రాణిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటోంది. ప్రస్తుతం నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో బీఎస్సీ డేటా సైన్స్ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. ఈమె మేనత్త కరాటేలో బ్లాక్ బెల్ట్.. అనేక రంగాల్లోనూ ఆమె ఆరితేరారు. అదే స్ఫూర్తితో వేద సంహిత ఆటలపై... ముఖ్యంగా అథ్లెటిక్స్‌పై మక్కువ పెంచుకుంది. ఆరో తరగతి చదివే సమయంలో ఆమె క్రీడల పట్ల చూపిన ఆసక్తి, ఉత్సాహాన్ని గమనించి వ్యాయామ ఉపాధ్యాయుడు, తల్లిదండ్రులు ప్రోత్సహించారు. దీంతో షాట్‌పుట్‌లో రాణిస్తూ పతకాలు సాధిస్తోంది. 2019లో జరిగిన ఏపీ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న వేద సంహిత తృతీయ స్థానంలో నిలిచింది. 2024లో జరిగిన ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. 37వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రెండో స్థానంలో నిలిచింది. తాజాగా ఈ నెల 14, 15 తేదీల్లో గుంటూరులో జరిగిన సీనియర్ అథ్లెటిక్స్ స్టేట్ మీట్‌లో షాట్‌పుట్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకుంది. ఒక్క షాట్‌పుట్‌లోనే కాదు.. కర్రసాము, టెన్నిస్‌ల్లోనూ రాణిస్తోంది. పెయింటింగ్‌లోనూ ప్రతిభ కనబరుస్తోంది. అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయిలో రాణించడమే తన లక్ష్యమని వేద సంహిత 'ఆంధ్రజ్యోతి'కి చెప్పింది.


స్టేట్ మీట్‌లో బంగారు పతకం అందుకున్న వేళ

స్టూడెంట్ బస్ పాస్.. తీసుకున్నారా?



- విద్యార్థులూ ఈ నిబంధనలు తెలుసుకోండి?
- కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి సూచనలు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ నెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు బస్‌పాస్‌ల జారీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాకినాడ జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఉమ్మడిజిల్లావ్యాప్తంగా విద్యార్థులు ఆయా జిల్లా కేంద్రాల్లోని కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం బస్‌స్టేషన్‌లోని బస్‌పాస్ కౌంటర్లను సంప్రదించాలని, ఉదయం 8గంటలనుంచి రాత్రి 8గంటల వరకు ఇవి అందుబాటులో ఉంటాయని ఆయన చెప్పారు.

విద్యార్థులు.. ఈ సూచనలు పాటించండి

బస్‌పాస్ కావాలనుకునే విద్యార్థులు ఈ కింద సూచనలు పాటించాల్సి ఉంటుంది. విద్యార్థి తన పూర్తి వివరాలతోపాటు ఫొటోతో buspassonline.apsrtconline.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని దరఖాస్తు ఫారం ప్రింట్ తీసుకోవాలి. దరఖాస్తుపై సంబంధిత పాఠశాల ప్రిన్సిపాల్ లేదా ప్రధానోపాధ్యాయుడితో సంతకం చేయించి స్టాంప్ వేసి దాన్ని సంబంధిత డిపో కార్యాలయానికి సమర్పించాలి. దరఖాస్తుతోపాటు ఆధార్‌కార్డు, పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల మార్కుల జాబితా జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా జత చేయాలి. విద్యార్థి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా పేర్కొనాలి. విద్యాసంస్థలు కూడా తరగతుల వారీగా విద్యార్థుల అడ్మిషన్ జాబితాను ప్రిన్సిపాల్/ప్రధానోపాధ్యాయుడి సంతకంతో సంబంధిత డిపో మేనేజర్ కార్యాలయానికి అందజేయాలి. లేకుంటే ఆ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులకు బస్ పాస్‌లు జారీ చేయరు. 12ఏళ్లలోపు బాలురు, 18ఏళ్లలోపు బాలికలు(10వ తరగతి వరకు ఉచిత బస్సు పాస్‌తోపాటు స్టూడెంట్ జనరల్ బస్సు పాస్(సంవత్సరం, త్రైమాసికం/నెలవారీ) పొందవచ్చని ప్రజారవాణా అధికారి తెలిపారు.

రాజమహేంద్రి మునిసిపల్ కమిషనర్ బదిలీ

గ్రేటర్ విశాఖ కమిషనర్‌గా కేతన్ గార్గ్ నియామకం



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆకస్మిక బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో ఆర్ నెం 1181ను జారీ చేసింది. కమిషనర్ కేతన్ గార్గ్‌ను గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ స్థానంలో ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. గత ఏడాదిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక 2024 జూలై 25న అప్పటి కమిషనర్ దినేష్‌కుమార్‌ను గుంటూరుకు బదిలీ చేసి కేతన్ గార్గ్‌కు రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్‌గా కూటమి ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. కేతన్ గార్గ్ బాధ్యతలు స్వీకరించి వచ్చే నెలతో ఏడాది పూర్తవుతుంది. ఇప్పటికి 11నెలలు కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. 2027లో అతి పెద్ద ఈవెంట్ రాజమహేంద్రవరం గోదావరి పుష్కరాలకు ప్రతిపాదనలతో పాటు, ప్లానింగ్ కేతన్ గార్గ్ సిద్ధం చేసుకున్నారు. అయితే గత రెండు నెలలుగా కమిషనర్‌ను బదిలీ చేస్తారనే సమాచారం ఉంది. కాని పుష్కరాల ముందు కమిషనర్ బదిలీ ఉండకపోవచ్చని అందరు భావించారు. మరో పక్క కమిషనర్ కూడా తనదైన శైలిలో రాజమహేంద్రవరంలో పనులు చేపట్టారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ఆక్రమణల తొలగింపు వేగవంతం చేశారు.సరిగ్గా ఇదే విధానం గతంలో విజయరామరాజు చేపట్టిన నెలలోపు ఆయన కూడా బదిలీ అయ్యారు. ఇప్పుడు అదే తరహాలో కమిషనర్ కేతన్ గార్గ్ బదిలీ జరగడం వెనుక.. కమిషనర్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు కావొచ్చనే వాదన వినిపిస్తోంది. రాజమహేంద్రవరంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, తాగునీటి ఎద్దడిని అధిగమించే యాక్షన్ ప్లాన్ చేయడం, ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలు ఎప్పటికప్పుడు కార్యరూపం దాల్చేలా చేయడం వేగంగానే చేశారు. నగర ప్రజలలో తనదైన ముద్రను వేసుకున్నారు. కేతన్ గార్గ్ బదిలీ కావడంతో ఆ స్థానంలో గతంలో తూర్పుగోదావరి జిల్లాలో పని చేసిన రెండో ఉన్నతాధికారిని నియమించనున్నట్టు తెలిసింది. ఆయన పదోన్నతిపై ముఖ్యస్థానంలో ఉన్నప్పటికి రాజమహేంద్రవరానికి ప్రాధాన్యమిస్తున్నట్టు సమాచారం. అయితే గత ప్రభుత్వంలో చేసిన సదరు అధికారిని కూటమి ప్రభుత్వం అనుమతిస్తుందో లేదో వేచి చూడాలి. కేతన్ గార్గ్ మంగళవారం రిలీవ్ అయ్యే అవకాశం ఉంది.

సోషల్ వెల్ఫేర్ అధికారులపై విచారణకు ఆదేశం

కాకినాడ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గతంలో పనిచేసిన సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల వెరిఫికేషన్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు విచారణకు విజిలెన్స్ సిఫారసు చేసింది. కాకినాడ జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా గతంలో పని చేసిన డీవీ రమణమూర్తి, ప్రస్తుత డీడీ ఎం.శోభారాణి, జేడీ రంగలక్ష్మిలపై విచారణకు ఆదేశించింది. వీరు గతంలో పనిచేసిన సమయంలో పలు పీజీ కోర్సుల విద్యార్థుల పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి 50శాతం క్షేత్రస్థాయి వెరిఫికేషన్ చేయకుండా మంజూరు చేశారనే అభియోగంపై విచారణకు ఆదేశిస్తూ లిఖిత పూర్వక సంజాయిషీ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కెరటాలు

అంతర్వేది, కేశవదాసుపాలెం ఏటిగట్లకు గండి.. కొబ్బరి, సరుగుడు తోటల్లోకి ఉప్పు నీరు


కొబ్బరి, సరుగుడు తోటలను ముంచుతున్న సముద్రనీరు

అంతర్వేది, జూన్ 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది, కేశవదాసుపాలెం గ్రామాల్లో సముద్ర తీర ప్రాంతాల వద్ద సోమవారం ఉదయం కెరటాల ఉధృతికి గట్లకు గండి పడింది. ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కెరటాలు అంతర్వేది సగర సంగమం నుంచి కేశదాసు పాలెం, కేశనపల్లి, కరవాక వరకు తీర ప్రాంత గ్రామాలు ఉప్పు నీటిమయ్యాయి. వాతావర ణంలో మార్పులు, అక్కడక్కడ కొద్ది పాటి వర్షాలు కురవడంతో సముద్రం వెంబడి ఉన్న తాత్కాలిక గట్లకు గడ్లు పడ్డాయి. సముద్రపు ఉప్పు నీరు అంతర్వేది, అంతర్వేది దేవస్థానం, కేశవదాసుపాలెం గ్రామాల్లో కొబ్బరి, సరుగుడు తోటల్లోకి తొచ్చుకుని వచ్చింది. 300 మీటర్ల ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కెరటాల తాకిడికి తీర ప్రాంతం కోతకు గురవుతోంది.

ఎస్ఐఎఫ్టీ ప్రిన్సిపాల్‌గా అంజలి



కాకినాడ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (ఎస్ఐఎఫ్టీ) ప్రిన్సిపాల్‌గా ఎస్.అంజలి (అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ కేడర్) సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆక్వా రైతులకు మేలు జరిగే విధంగా ల్యాబ్‌ల ద్వారా పీసీఆర్, మేత నాణ్యత, నీటి నాణ్యత, మైక్రో బయాలజీ పరీక్షల నిర్వహణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల చెరువుల వద్దకు వెళ్లి మొబైల్ ల్యాబ్ సేవలందిస్తామన్నారు. రైతులు సాగు చేసిన రొయ్యలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ఎస్‌సీఎంఎస్, జీసీఎంఎస్ ల్యాబ్‌ల ద్వారా పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిషేధించిన యాంటీ బయాటిక్స్ లేని రొయ్యల ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఆక్వా రైతులంతా ప్రభుత్వ ల్యాబ్ సర్వీసులను పూర్తిగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫిషింగ్ బోటు డ్రైవర్లకు శిక్షణలో భాగంగా ఇంజన్ రిపేరు నిర్వహణ, బోటు నడపడం, నావిగేషన్ సీమన్‌షిప్, వలల తయారీ రిపేరు, సముద్రంలో చేపల వేట అంశాలపై ఏడాది పాటు శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 30శాతం జీవీఏ లక్ష్యాలు సాధించడంలో క్షేత్రస్థాయి సిబ్బందికి కెపాసిటీ బిల్డింగ్ చేయడంలో తమ ఇనిస్టిట్యూట్ పాత్ర ఉంటుందని అంజలీదేవి వివరించారు.

ఆన్‌లైన్‌లో ఫైనల్ మెరిట్ లిస్ట్

జీజీహెచ్ (కాకినాడ), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది జనవరి 21న కాకినాడ రంగరాయ వైద్య కళాశాల(ఆర్ఎంసీ) విడుదల చేసిన ఉద్యోగాల నోటిఫికేషన్‌కు సంబంధించి యాజమాన్యం ముఖ్యమైన సమాచారాన్ని విడుదల చేసింది. నియామక ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల తుది ఎంపిక పూర్తయ్యిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ సోమవారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు తమ పేర్లను ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు తమకు కేటాయించిన ఉద్యోగ కేంద్రాలకు అనుగుణంగా కాకినాడ రంగరాయ వైద్య కళాశాల, ఆర్ఎంసీ నర్సింగ్ కాలేజ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయాల్లో తమ విద్యార్హతల సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. పరిశీలన అనంతరం నియామక ఉత్తర్వులు అందజేస్తామన్నారు.

24 నుంచి మరిడమ్మ జాతర ఉత్సవాలు

విజయవంతం చేయండి: ఆర్డీవో


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీరమణి

పెద్దాపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలో ఈ నెల 24 నుంచి వచ్చే నెల 31వ తేదీ వరకు జరిగే మరిడమ్మ జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆర్డీవో కత్రెడ్డి శ్రీరమణి కోరారు. మరిడమ్మ దేవస్థానంలో సహాయ కమిషనర్ కురం విజయలక్ష్మి ఆధ్వర్యంలో జాతర నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సుమారు 37 రోజులపాటు జరిగే జాతర మహోత్సవాలకు వేలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ రాజేష్, ఎలక్ట్రికల్ ఏఈ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, ఎస్ఐ మౌనిక, దేవస్థానం సిబ్బంది రమణ, జనసేన పట్టణాధ్యక్షుడు పోల మరశెట్టి సత్తిబాబు, కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్, ఆసాది రాయి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పెండ్యాల నుంచి నీరు విడుదల

నిడదవోలు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం విజ్జేశ్వరం వద్ద ఉన్న పెండ్యాల పంపింగ్ స్కీమ్ ద్వారా కానూరు ఆయకట్టుకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి సాగు నీటిని విడుదల చేసారు. డిస్ట్రిబ్యూటరీ కమిటి మాజీ అధ్యక్షుడు జుజ్జవరపు సూర్యభాస్కరరావు నీటిని విడుదల చేశారు. పెండ్యాల పంపింగ్ స్కీమ్ ఆయకట్టు ద్వారా మండలంలోని గోపవరం, పురుషోత్తపల్లి, కానూరు మీదుగా సుమారు ఏడు వేల ఎకరాలకు నీరు అందనుంది.

ఎ.అన్నవరంలో కొత్త జూనియర్ కళాశాల మంజూరు

కాకినాడ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం ఎ.అన్నవరంలో శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కొనసాగుతోంది. ఈ సంస్థకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాల ఏర్పాటుకు అనుమతి మంజూరు చేస్తూ 2025-26 విద్యా సంవత్సరంలో శారద జూనియర్ కళాశాలగా కొనసాగేందుకు పాఠశాల విద్యా శాఖ జీవో నెం.239 జారీ చేసింది.

అంతర్జాతీయ సెమినార్‌లో రమ్యసుధ ప్రతిభ

ఉత్తమ పరిశోధన పత్రం అవార్డు పొందిన రంగంపేట ఉపాధ్యాయిని


రమ్యసుధను అభినందిస్తున్న హెచ్ఎం పార్థసారథి

రంగంపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12, 13 తేదీల్లో నేపాల్ దేశంలోని ఖాట్మాండులో ఎంఐటీ వారు ఏర్పాటు చేసిన 'ఇన్నోవేటివ్ ప్రాక్టీసస్ ఫర్ అక్సిలరేటెడ్ గ్రోత్ ఇన్ కామర్స్ హ్యుమానిటీస్ సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సెమినార్‌లో రంగంపేట ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయిని రమ్యసుధ పాల్గొన్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి తెలిపారు. ఈ సెమినార్‌లో రమ్యసుధ సమర్పించిన 'రీ ఇన్‌వెంటింగ్ టుమారో డ్రైవింగ్ గ్రోత్ త్రూ సెంటిఫిక్ ఇన్నోవేషన్' అనే పరిశోధన పత్రానికి ఉత్తమ పరిశోధన పత్రం అవార్డు లభించిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన రమ్యసుధను హెచ్ఎం పార్థసారధి, ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

6,527 మంది ఉపాధ్యాయులు బదిలీ

కాకినాడ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు,స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, ఎస్జీటీలకు సంబంధించి 6,527 మంది బదిలీ అయినట్టు కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు. జడ్పీ యాజమాన్యంలోని స్కూల్ అసిస్టెంట్లు నుంచి ప్రధానోపాధ్యాయులుగా 96 మంది, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యం నుంచి 10 మంది, స్కూల్ అసిస్టెంట్లు నుంచి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందారన్నారు. జడ్పీ యాజమాన్యంలోని ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా 28 మంది, ప్రభుత్వ యాజమాన్యంలోని ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా 19 మంది పదోన్నతి పొందినట్టు డీఈవో తెలిపారు. మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యంలోని ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా 204 మంది పదోన్నతి పొందారన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బదిలీలు,పదోన్నతుల ప్రక్రియ పూర్తయినట్టు డీఈవో తెలిపారు.

ఆరుద్ర కుమార్తెకు ఇంటి స్థలం

సీఎం చంద్రబాబు హామీ మేరకు పట్టా అందజేత


సాయిలక్ష్మికి పట్టాను అందజేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం గొల్లగూడేనికి చెందిన రాజులపూడి ఆరుద్ర దివ్యాంగురాలైన తన కుమార్తె సాయిలక్ష్మీచంద్ర ఇటీవల జిల్లాకు వచ్చిన సీఎం చంద్రబాబును కలిసి తమ గోడును వివరించారు. దీంతో స్పందించిన ఆయన ఆమెకు ఉద్యోగంతోపాటు ఇళ్లు మంజూరు చేయాలని సీఎం ఆదేశించారు. దీనిలోభాగంగా కామనగరువులో 72గజాల స్థలాన్ని సోమవారం కలెక్టరేట్‌లో సాయిలక్ష్మీచంద్రకు కలెక్టర్ మహేష్‌కుమార్ అందజేశారు. త్వరలో ఉద్యోగం కూడా ఇప్పిస్తామని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారిణి బీఎల్ఎన్ రాజకుమారి, తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ పాల్గొన్నారు.

27న షర్మిల రాక

కడియం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రాజమహేంద్రవరం రానున్నట్టు జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్ తాడాల కొండ్రాజు ఆధ్వర్యంలో కడియంలో ప్రజాసామ్య సంరక్షణ, రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీకే మాట్లాడుతూ ఏఐసీసీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ 7 బుల్లెట్ పాయింట్లను తయారు చేసిందన్నారు. వీటిని కరపత్రాల ద్వారా ఇంటింటికి కాంగ్రెస్ అనే నినాదంతో ప్రజల్లోకి తీసుకెళుతున్నామన్నారు. ప్రస్తుతం సామాజిక న్యాయం జరగడం లేదని, మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్టిన్ లూథర్, అరిగెల అరుణ కుమారి, వడయార్, కాకర్ల హరిబాబు, మోతా శారద, చిన్నం మురళి, భద్రం దొర, అబ్దుల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి క్షేత్రంలో యోగాంధ్ర

- పాల్గొన్న కోనసీమ కలెక్టర్ మహేష్‌కుమార్, కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు

ఆత్రేయపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీనివాస ప్రాంగణంలోని జిల్లా స్థాయి ఫ్యామిలీ యోగాంధ్ర కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. యోగా సాధనపై ప్రజలకు అవగాహన కల్పించారు. యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం ప్రశాంత జీవనశైలిని పొందవచ్చని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. యోగా భారతదేశ వారసత్వ సంపదగా అభివర్ణించారు. ఆధునిక జీవనశైలిలో అనేక రుగ్మతలతో బాధపడుతున్న తరుణంలో యోగా ప్రాణాపాయ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. మూడు తరాలకు చెందిన సంతతి ఈ కార్యక్రమంలో పాల్గొనడం గర్వకారణమన్నారు. ఆహ్లాదకరమైన వాతవరణమైన వాడపల్లి పుణ్యక్షేత్రంలో యోగా సాధన చేయడం ఏర్పాట్లు తదితర అంశాలపై నిర్వహకులను అభినందించారు. సాంస్కృతిక ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, ఆయుష్ వైద్యుల పర్యవేక్షణలో ఓం శాంతి యోగా గురువులు ప్రదర్శన చేయించిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్.రాజకుమారి, ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రదరరావు, ఆర్డీవో పి.శ్రీకర్, తహశీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన


వాడపల్లిలో జరిగిన యోగాంధ్రలో సాంస్కృతిక ప్రదర్శన దృశ్యం

భారీగా హాజరైన ప్రజలు (డ్రోన్ ఫొటో)

దబ్బాదిలో ప్రబలిన డయేరియా

- వృద్ధురాలి మృతి
- రౌతులపూడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 44 మంది గిరిజనులు
- వారిలో 12 మందికి పైగా పిల్లలు
- పులిహోర తిన్నామంటున్న గ్రామస్తులు




రౌతులపూడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రౌతులపూడి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం సబ్‌ప్లాన్ ఏజెన్సీ రాఘవపట్నం గ్రామశివారు దబ్బాదిలో డయేరియా ప్రబలింది. గ్రామానికి చెందిన వంతల చెల్లయ్యమ్మ(65) మృతిచెందింది. వెలుగు లోవరాజు, వంతు నాగసీత, వంతు గంగాభవాని, రొబ్బా వీరబాబుతో సహా సుమారు 44 మంది రౌతులపూడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో 9 నుంచి 12 ఏళ్ల ఉన్న పిల్లలు 12 మందికి పైగా ఉన్నారు. మంచాలు సరిపోకపోవడంతో డీసీహెచ్ఎస్ స్వప్న ఆదేశాలు మేరకు తుని ఏరియా ఆసుపత్రి తరలించారు. పాడేరు ఆసుపత్రిలో లోవరాజు, రమణ వైద్యం పొందుతున్నారు. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంతు రామయ్యమ్మ, నాగమణి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు గ్రామంలో మోదకొండమ్మతల్లి ఆలయానికి మొక్కు తీర్చుకోవడానికి దబ్బాది, సుందరకోట, అనసగిరి గ్రామాలకు చెందినవారు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మధ్యాహ్నం 12 గంటలకు వ్యాన్‌పై 60 మందితో బయలుదేరారు. మార్గమధ్యంలో నర్సీపట్నం దాటిన తరువాత రాత్రి 8 గంటల సమయంలో వారి వెంట పట్టుకుని వెళ్లిన పులిహోర తిన్నారు. ఆదివారం తెల్లవారు జామున 3 గంటలకు అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. స్నానాలు చేసి రామయ్యమ్మ,నాగమణి మొక్కు తీర్చుకు న్నారు. తర్వాత వంటలు చేసుకుని తినడానికి సిద్ధంగా ఉన్న సమయంలో కొందరికి కడుపు నొప్పితో విరోచనాలు పట్టుకున్నాయి. వారిని పా డేరు ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం వారికి బాగా ఉండడంతో వారితో పాటు మిగిలిన వారు బస్సులో బయలు దేరి ఆదివారం అర్ధరాత్రి స్వగ్రామం దబ్బాది చేరుకున్నారు. అనంతరం వారికి విరోచనాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో వంతల చెల్లయ్యమ్మ మృతిచెందడంతో ఒక్కసారిగా గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. వైద్యం సిబ్బందికి విషయం తెలియడంతో హుటాహుటిన రౌతులపూడి ఆసుపత్రికి తరలించి వైద్యం అంది స్తున్నారు. గ్రామస్తులు తిన్న పులిహోరను వైద్య సిబ్బంది శాంపిల్ తీసి టెస్టులకు పంపించారు. దబ్బాది గ్రామస్తులంతా తమ వారి కోసం రౌతులపూడి ఆసుపత్రికి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. బాధితులకు టీడీపీ యువనేత సోమ రౌతు చంద్రమౌళి భోజనాలు అందించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని జిల్లా వైద్యా ధికారి డా.నరసింహ నాయక్ పరామర్శిం చారు. ఆసుపత్రిలో పరిస్థితులను పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలిచ్చారు.

శానిటేషన్ మెరుగుపడకపోతే చర్యలు

- అన్నవరం దేవస్థానం ఈవో హెచ్చరిక
- శానిటేషన్ సూపర్‌వైజర్లు, అధికారులతో సమీక్ష


శానిటరీ సూపర్‌వైజర్లతో సమావేశమైన ఈవో సుబ్బారావు

అన్నవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో శానిటేషన్ నిర్వహణపై భక్తుల్లో 50శాతం మాత్రమే సంతృప్తి ఉందని, పరిస్థితి మెరుగుపడకపోతే చర్యలు తప్పవని ఈవో వీర్ల సుబ్బారావు హెచ్చరించారు. సోమవారం తన కార్యాలయంలో శానిటేషన్ సూపర్‌వైజర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సత్రం గదుల్లో నిర్వహణ సరిగా లేదని, భక్తులకు శానిటేషన్ సిబ్బంది వారు కోరిన సమాచారం అందించాలని, మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలిగినా ఎవరో వస్తారని చూడకుండా తక్షణ సాయం అందించాలన్నారు. ప్రతిశానిటరీ సూపర్‌వైజర్ వద్ద దేవస్థానం వైద్యుని, అంబులెన్స్ ఫోన్ నెంబర్లు ఉంచుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఇక్కడ జరిగే శానిటేషన్ నిర్వహణ దేవదాయశాఖ ప్రధాన కార్యలయం, సీఎంవోలో నివేదిక రూపంలో ఉంటుందని జాగ్రత్తగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, సూపరెంటెండెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దినుసులు పరిశీలన

అన్నవరం దేవస్థానానికి అవసరమయ్యే దినుసులును సోమవారం ఆహార నియంత్రణ అధికారి సుబ్బారావు సోమవారం పరిశీలించారు. ఇప్పటివరకు టెండర్ దాఖలు సమయంలో వీటిని పరిశీలించి హడావిడిగా ముగించేవారు. ఈనెల 20న టెండర్లు తెరవనున్న సమయంలో ముందస్తుగా టెండర్‌దారులు సరఫరా చేయనున్న దినుసుల శాంపిల్స్ తీసుకురావాలని ఈవో సుబ్బారావు గుత్తేదారులను ఆదేశించి నాణ్యత ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో పరిశీలించారు. ఈ సందర్భంగా సోమవారం తీసుకొచ్చిన శాంపిల్స్ ఏ విధంగా ఉన్నాయో టెండర్ ఖరారయ్యాక ఇదే నాణ్యతతో కూడిన దినుసులు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్‌స్టోర్స్ అధికారులు భాస్కర్, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

గోదావరిలో మునిగి కరప యువకుడి మృతి


సాయికృష్ణ (ఫైల్‌ఫొటో)

కరప, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యానాం-ఎదుర్లంక బ్రిడ్జి కింద గోదావరిలో స్నానానికి దిగి గల్లంతైన కరప యువకుడి మృతదేహం సోమవారం సాయంత్రం లభ్యమయ్యింది. కాకినాడ జిల్లా కరప గ్రామానికి చెందిన నరాల సాయికృష్ణ(17) ఆదివారం మిత్రులతో కలిసి యానాం వెళ్లాడు. యానాం-ఎదుర్లంక బ్రిడ్జి దాటిన తరువాత గోదావరిలో స్నానానికి దిగాడు. అయితే లోతు ఎక్కువగా ఉండడంతో సాయికృష్ణ గల్లంతయ్యాడు. స్నానానికి దిగిన మిగిలిన మిత్రులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్ర త్యేక బోట్ల ద్వారా ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఆదివారం సాయంత్రం సాయికృష్ణ స్నానానికి దిగిన చోటనే శవమై తేలడంతో పోలీసులు ఒడ్డుకు తీసుకువచ్చారు. విగతజీవిగా పడిఉన్న సాయికృష్ణను చూసి కుటుంబసభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. సాయికృష్ణ తండ్రి బుజ్జి, తాత రామకృష్ణ కరపలో హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు బంధువులు తెలిపారు. కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు మృ తుడి కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

పెద్దాపురంలో వ్యక్తి దారుణ హత్య

- కేసు నమోదు చేసిన పోలీసులు
- పలు కోణాల్లో దర్యాప్తు


శ్రీనివాస్ ఫైల్‌ఫొటో


హత్యకు గురైన శ్రీనివాస్

పెద్దాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం శివారు కట్టమూరు పుంత ప్రాంతంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కిర్లంపూడి మండలం గోనెడ గ్రామానికి చెందిన జానకి సత్య శ్రీనివాస్ అలియాస్ వెంకన్నబాబు (32) స్థానికంగా ఓ రైస్ మి ల్లులో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. మృతుడు శ్రీనివాస్ హత్యకు గురి కావడానికి సంబంధించి పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తును ప్రారంభించారు. పదునైన ఆయుధంతో మెడ భాగంలో బలంగా కొట్టి చంపినట్లు తెలు స్తోంది. మృతదేహం వద్ద బీరు బాటిల్‌కు సంబ ంధించిన గాజు ముక్కలు ఉండటం కూడా పలు అనుమానాలు కలిగిస్తోంది. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో శ్రీనివాస్ అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. వివాహేతర సంబం ధమా లేక మద్యం మత్తులో ఎవరైనా హత్య చేశారా మరే ఇతర కారణమేదైనా ఉందనే కోణంలో పోలీసులు దర్యాప్తును చేస్తున్నారు. పెద్దాపురం ఎస్ఐ మౌనిక సంఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. దీనిపై కేసును నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు.

సంద్రంలో వేటకు వెళ్లి మృతదేహాలుగా తేలి..

- ఇద్దరు మత్స్యకారులు మృతి
- మరో నలుగురు సురక్షితం
- కోనసీమ జిల్లా అంతర్వేదిలో ప్రమాదం


అంతర్వేదిలో లభ్యమైన నాగిడి రాము, తమ్ము పోతురాజు మృతదేహాలు

అంతర్వేది, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పొట్ట కూటి కోసం వేటకు బయలుదేరి అంతర్వేది సముద్ర తీరంలో ఇద్దరు మత్స్యకారులు గల్లంతై మృతదేహాలుగా తేలారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది సాగర సంగమం సముద్ర తీరంలో సోమవారం ఉదయం బోటు ప్రమాదం జరిగి ఇద్దరు మృతిచెందగా మరో నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణాజిల్లాలోని నాగలలంక గొల్లలమూత గ్రామానికి చెందిన ఆరుగురు మత్స్యకారులు ఆదివారం వేటకు బయలుదేరారు. ఐఎడీఏపీకే3 ఎం089 శ్రీకనకదుర్గ బోటు యజమాని నాగిడి వెంకటేశ్వరరావు బోటులో కృష్ణా జిల్లా నుంచి వేటకు బయలుదేరి బందరు మీదుగా అంతర్వేది చేరుకునేసరికి సోమవారం ఉదయం వాతావరణంలో వచ్చిన మార్పులకు సాగర సంగమం వద్ద అలల ఉధృతికి కెరటాలు ఒక్కసారిగా బోటుపై పడడంతో బోటుపైన ఉన్న నాగిడి రాము (20), తమ్ము పోతురాజు(50) జారి సముద్రంలో పడిపోయారు. సాటి మత్స్యకారులు వారిని కాపాడేందుకు ఎంత ప్రయత్నించినా ఉవ్వెత్తున ఎగసిపడుతూ కెరటాల రావడంతో సాగర సంగమం మొగ వద్ద గల్లంతయ్యారు. వారి ఆచూకీ కోసం మిగిలిన నలుగురు మత్స్యకారులు వెతకసాగారు. కెరటాలు అధికంగా రావడంతో అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బరుకు చేరుకుని స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. విశ్వనాథపల్లి సత్యనారాయణ, విశ్వనాథపల్లి నాగరాజు, విశ్వనాథపల్లి సామోరు, నాగిడి వెంకటేశ్వరరావు సురక్షితంగా బయటపడ్డారు. గల్లంతైన ఇద్దరి మృతదేహాలు గంటల వ్యవధిలోనే లభ్యం కావడంతో సఖినేటిపల్లి ఎస్ఐ దుర్గాశ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

రెండు బైకులు ఢీ.. ముగ్గురికి తీవ్రగాయాలు


ఆసుపత్రిలో క్షతగాత్రులు

వై.రామవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం పనసలపాలెం ప్రధాన రహదారిలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో పి.ఎర్రగొండకు చెందిన కోండ్ల బాబిరెడ్డి చవిటి దిబ్బలు నుంచి బైక్‌పై పి.ఎర్రగొండ వస్తున్నాడు. ఎదురుగా వై.రామవరం నుంచి అడ్డతీగల వెళ్తున్న మిరియాల సాయి, భూముల కొండ బాబుల బైక్ ఢీకొని ముగ్గురూ గాయపడ్డారు. వై.రామవరం ఆసుపత్రిలో చికిత్స అందించి మెరుగైన వైద్యానికి ఇద్దరిని కాకినాడ, ఒకరిని రంపచోడవరం ప్రభుత్వాసుపత్రులకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. బాబి రెడ్డి ఫిర్యాతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పాత గొడవల నేపథ్యంలో ఇరువర్గాలు దాడి

14 మందిపై హత్యాయత్నం కేసులు

ఆలమూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పాత గొడవల నేపథ్యంలో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు దాడి చేసిన సంఘటనలో ఇరు వర్గాలను అదుపు చేసి 14మందిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్టు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు. ఈనెల 15న రాత్రి కోనసీమ జిల్లా ఆలమూరు ఎర్రకాలనీ సమీపంలో పలివెల తేజ, కొమ్ము రోహిత్‌కి చెందిన వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడానికి కొట్లాటకు దిగారు. ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని ఆలమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వారు అందించిన సమాచారం మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. ఒక వర్గానికి చెందిన పలివెల తేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గునుపల్లి నాగసాయికృష్ణప్రసాద్, కొమ్ము రోహిత్, గౌరి శంకరర్, కొమ్ము నారాయుడు, ఆదినారాయణ, చల్లా సందీప్, సుబ్రహ్మణ్యం, ప్రసాద్‌తోపాటు పలువురిపై కేసు నమోదు చేశారు. అలాగే మరోవర్గానికి చెందిన కొమ్ము రోహిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలివెల తేజ, దొనకొండ మోషే, దొనకొం విజయ్, పొలమూరు ప్రసన్న, తోరాటి ఏసు, వేమగిరి అని ల్, మరికొందరిపై కేసులు నమోదు చేసినట్టు వారు తెలిపారు.

గంజాయితో నలుగురి అరెస్ట్

గండేపల్లిలో రూ.5.53 లక్షల విలువైన 50 గంజాయి ప్యాకెట్ల స్వాధీనం


గంజాయితో నిందితులను అదుపులోకి తీసుకున్న గండేపల్లి, జగ్గంపేట పోలీసులు

జగ్గంపేట/ గండేపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కారులో గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను కాకినాడ జిల్లా జగ్గంపేట సీఐ కార్యాలయంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సోమవారం వెల్లడించారు. కాకినాడ జిల్లా గండేపల్లి పోలీస్‌స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేస్తుండగా షిఫ్ట్ డిజైర్ కారును పోలీసులు ఆపారు. నెలూరు జిల్లాకు చెందిన కల్లపల్లి నాగేంద్ర, కడప జిల్లాకు చెందిన షేక్ సుధార్‌వల్లి, పందిళ్లపల్లి శివకుమార్, ఓ మైనర్ ఉన్నారు. కారులో 110.640 కిలోల గంజాయి ఉంది. వారిని అదుపులోకి తీసుకుని 50 గంజాయి ప్యాకెట్లు, 4 ఫోన్లు, రూ.3500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ నలుగురు సీలేరు నుంచి తిరుపతి మీదుగా తమిళనాడుకు చెందిన వ్యక్తికి గంజాయి రవాణా చేస్తున్నారని డీఎస్పీ వివరించారు. గంజాయి విలువ రూ.5,53,200 ఉంటుందన్నారు. దీనిపై గండేపల్లి పోలీస్‌స్టేషన్లో కేసు చేశామని తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన జగ్గంపేట సీఐ వైఆర్‌కె.శ్రీనివాస్, దర్యాప్తులో పాల్గొన్న గండేపల్లి ఎస్ఐ యువి.శివ నాగబాబు, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. సమావేశంలో సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు, ఎస్ఐలు శివనాగబాబు, రఘునందనరావు ఉన్నారు.

పోలిపాకలో ఇద్దరి అరెస్ట్

కూనవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంజాయితో ఇద్దరిని కూనవరం పోలీసులు పట్టుకున్నారు. కూనవరం ఎస్ఐ లతాశ్రీ కథనం ప్రకారం.. అల్లూరి జిల్లా కూనవరం మండలం పోలిపాక శివారు వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా నెల్లపాక నుంచి కూనవరం వైపుగా ద్విచక్రవాహనం (ఏపీ40ఏఎఫ్ 4943)పై వస్తున్న ఇద్దరు పోలీసులను చూసి ద్విచక్రవాహనాన్ని వెనక్కి తిప్పి పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో వారిని ఎస్ఐ లతాశ్రీ, సిబ్బంది వెంబడించి పట్టుకున్నారు. వారి బ్యాగులను పరిశీలించగా 21 కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. వారి వద్ద ఉన్న ద్విచక్ర వాహనం, ఫోన్‌ను సీజ్ చేశారు. వారికి గంజాయి అమ్మిన ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తి పరారీలో ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు. గంజాయి విలువ రూ.1,05,000 ఉంటుందని ఆమె చెప్పారు.


గంజాయితో ఇద్దరిని పట్టుకున్న కూనవరం పోలీసులు

మద్యానికి డబ్బులివ్వలేదని ఆత్మహత్య

బిక్కవోలు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం ఊలపల్లి శెట్టిబలిజపేటకు చెందిన మేడిశెట్టి వెంకటరమణ (45) మద్యానికి డబ్బులివ్వలేదని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పందలపాక గ్రామంలో జరిగింది. ఎస్ఐ వి.రవిచంద్ర కుమార్ వివరాల ప్రకారం.. వెంకటరమణ జట్టు కూలీగా పందలపాకలోని ఒక రైసుమిల్లులో పనిచేస్తున్నాడు. ఆదివారం వర్షం కారణంగా పని లేకపోవడంతో మద్యం కోసం ఇంట్లో తల్లి, కుమారుడిని రూ.100 అడిగాడు. వారు లేదనడంతో మిల్లు వద్ద మరో కూలీని డబ్బులు అడిగాడు. అతడు కూడా లేవనడంతో మిల్లు ముందు ఉన్న రేకుల షెడ్డుతో టవల్‌తో ఉరి వేసుకుని మృతిచెందాడు. మిల్లు వాచ్‌మెన్ ఆదివారం రాత్రి పది గంటలకు ఉరి వేసుకున్న వెంకటరమణను చూసి సమాచారం ఇవ్వడంతో తాము కేసు నమోదు చేసి మృతదేహన్ని సోమవారం పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ వివరించారు.


వెంకటరమణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రవిచంద్రకుమార్

తరలిన తల్లిలోకం!


రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. దీంతో వాటిని తీసుకోవడానికి కాకినాడ మెయిన్‌రోడ్డులోని పోస్టాఫీస్ వద్ద లబ్దిదారులు ఇలా కిక్కిరిసేలా క్యూ కట్టారు.
- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

నిద్ర గమ్మత్తు!


పూట గడవడానికి కష్టపడి అలసిపోయిన ఓ రిక్షా కార్మికుడు రోడ్డు పక్కన ఓ ఇంటి ఆవరణలో ఆదమరిచి నిద్రపోతుంటే పక్కనే రెండు శునకాలు కూడా కునుకువేశాయి. కాకినాడలో గమ్మత్తుగా కనిపించిన ఈ చిత్రాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.
- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

టీడీపీ అధ్యక్ష, కార్యదర్శుల నియామకం

పెద్దాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పెద్దాపురం మండల శాఖ అధ్యక్షుడిగా తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, కార్యదర్శిగా కట్టమూరు మాజీ ఎంపీటీసీ గుత్తుల సూర్యావతీశ్రీనివాస్ నియమితులయ్యారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నియామక ప్రక్రియ నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులకు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో పాటు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యతోనే సమాజంలో పెనుమార్పు

● సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



బాల వాటిక పాఠశాలను ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణ

కాకినాడ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానంతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా సమాజంలో పెను మార్పు వస్తుందని సీబీఐ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. నగరంలోని గాంధీ నగర్‌లో గల భారతీయ విద్యా భవన్‌కు చెందిన బాల వాటిక (కేంద్ర పాఠ్యాంశం) పాఠశాలను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అభ్యసించడం వల్ల దేశ నిర్మాణానికి ఎంతగానో ఉపయోగపడతారన్నారు. అందుకే బలమైన పునాదితో కూడిన విద్య చాలా అవసరమన్నారు. భారతీయ విద్యా భవన్ దేశ, విదేశాల్లో ఎంతోమందికి ఉన్నత విద్య అందించి వారిలో వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి పెంచుతోందన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ్ పాఠశాల మాజీ చైర్మన్ డీవీ కృష్ణంరాజు, పి.రఘుపతిరాజు, యు.విశ్వనాథరాజు, పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలను తెరిచి ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈవో శివరామకృష్ణయ్య

తెరుచుకున్న కోదండరామపురం పాఠశాల

సామర్లకోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారున వున్న కోదండరామపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఎట్టకేలకు తెరుచుకుంది. ఈ పాఠశాల దుస్థితిపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి డీఈవో స్పందించి తక్షణం పాఠశాలను తెరిచి ఉపాధ్యాయులను హాజరుపరచాలని ఎంఈవో వై. శివరామకృష్ణయ్యను ఆదేశించారు. దీంతో ఎంఈవో మరో ఇద్దరు ఉపాధ్యాయులతో కలిసి సోమవారం ఉదయం 8 గంటలకు కోదండ రామపురం పాఠశాలకు చేరుకుని తెరిచారు. దీనిపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎంఈవో, ఉపాధ్యాయులతో కలిసి జిల్లా మానవహక్కుల పరిరక్షణ సంఘ ప్రతినిధులు నూతలపాటి అప్పలకొండ, కుంచే నానిబాబు, జుత్తుక అప్పారావు ఇంటింటా సర్వేలో పాల్గొన్నారు. పాఠశాల మూసివేతతో నలుగురు చిన్నారులను కాన్వెంట్‌లో చేర్పించినట్టు వారి తల్లిదండ్రులు చెప్పారు. ప్రభుత్వం విద్యకు అందిస్తున్న పలు సదుపాయాలను సమగ్రంగా వివరించడంతో వారిని కాన్వెంట్ల నుంచి మున్సిపల్ పాఠశాలలో చేర్పేందుకు అంగీకరించారు. బడిఈడు పిల్లలు మరో ఆరుగురు ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. కాగా పాఠశాలను అర్థంతరంగా మూసివేయడం వెనుక ఎవరి నిర్లక్ష్యం ఉందనే అంశంపై విద్యా శాఖ ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు జరపనున్నారు.



ఎంపీ హరీష్‌మాధుర్‌కు గజమాల వేసి స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

ఎంపీ హరీష్‌మాధుర్‌కి ఘన స్వాగతం

తాళ్లరేవు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విదేశీ పర్యటన ముగించుకుని స్వగ్రామానికి విచ్చేసిన అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌కు మండలంలోని జైభీమ్‌పేట వద్ద తెలుగు దేశం పార్టీ నేత జక్కల ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో అఖండ స్వాగతం పలికారు. గజమాల వేసి సత్కరించారు. టీడీపీ కార్యాలయం వద్ద ఎంపీకి ఆ పార్టీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, నడింపల్లి వినోద్, మందాల గంగసూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ, వాడ్రేవు వీరబాబు తదితరులు ఎంపీ హరీష్ మాధుర్‌ని స్వాగతించారు.



అతిసార వ్యాధి నిర్మూలనపై గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సుబ్బారావు

అతిసార నివారణపై చిన్నారులకు అవగాహన

పిఠాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో అతిసార వ్యాధి ప్రబలకుండా వచ్చే నెల 31వ తేదీ వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కేవీ సుబ్బారావు తెలిపారు. అతిసార వ్యాధిపై వైద్య-ఆరోగ్య ఆ శాఖ రూపొందించిన గోడ పత్రికలను పిఠాపురంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాడా పీడీ చైత్రవర్షిణితో కలిసి ఆవిష్కరించారు. పిఠాపురం నియోజకవర్గంలో ఐదేళ్ల లోపు చిన్నారులు 21,321 మంది ఉన్నారని, వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశామని చెప్పారు. మల్లాం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ ట్రాక్టర్లు ప్రారంభం



ట్రాక్టర్లు, ట్రైలర్లను ప్రారంభిస్తున్న జనసేన ఇన్‌చార్జి శ్రీనివాసరావు, గొల్లప్రోలు చైర్‌పర్సన్ మంగతాయారు

గొల్లప్రోలు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో చెత్త సేకరణకు కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ట్రైలర్లను జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు సోమవారం ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ.18.82లక్షలతో మూడు ట్రాక్టర్లు, రూ.8.64లక్షలతో మూడు ట్రైలర్లు, రూ.5.10 లక్షలతో 25 పుష్ కార్టులు, రూ.3.67 లక్షలతో 1200 లీటర్ల కెపాసిటీ డస్ట్‌బిన్లు, రూ.84,842లతో 100 డస్ట్‌బిన్లు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనరు నామ కనకారావు, గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, జనసేన నాయకుడు కడారి తమ్మయ్యనాయుడు, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, బస్సా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి'

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ షాన్‌మోహన్‌కు ఎస్ఎఫ్ఐ కాకినాడ బృందం సోమవారం వినతిపత్రం అందజేసింది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, గంగాసూరిబాబు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ అమ్ముతున్నారన్నారు. అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ చిన్ని తదితరులు పాల్గొన్నారు.





కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు, అంగన్వాడీ వర్కర్లు

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం, ఆదర్శ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టాల్సిన బోర్డు నిధులను ప్రభుత్వాలు తమ అవసరాలకు వాడుకోవడం దారుణమన్నారు. బోర్డు నిధుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క రూపాయి కూడా జమ చేయలేదన్నారు. కార్మికుల సంక్షేమం కోసం వసూలు చేసిన సెస్ డబ్బులే బోర్డులో ఉన్నాయన్నారు. బోర్డు నిధులు వాడుకున్న ప్రభుత్వాలు బోర్డుకి జమ చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ లెక్క చేయట్లేదన్నారు. అందరికీ ఉచిత ఇసుక అందిస్తామని హామీలు ఇచ్చి సంవత్సరం దాటుతున్నా ఎలాంటి చర్యలూ తీసుకోలేదని విమర్శించారు. ధర్నాలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి ఆదినారాయణమూర్తి, రాష్ట్ర సహాయ కార్యదర్శి యేసు, బాలరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం అందించారు. అంగన్వాడీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బేబీరాణి, జిల్లా అధ్యక్షురాలు పద్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేషబాబ్జీ, రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి పెద్దలు చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని మ్యానిఫెస్టోలో పేర్కొని నేడు అధికారంలోకి రాగానే అంగన్వాడీలను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులుగా అంగన్వాడీలను నమోదు చేసి తప్పు చేశారన్నారు. అంగన్వాడీ కుటుంబంలో పిల్లలకు తల్లికి వందనం వేయకపోవడమే కాకుండా ఇంట్లోని వృద్ధులకు వృద్ధాప్య పింఛను ఆపివేశారన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి రమణ, వర్కింగ్ కమిటీ సభ్యులు వెంకటరమణ, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ కాకినాడ శరవణ నూతన సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం



ప్రమాణం చేసిన అలయన్స్ క్లబ్ నూతన సభ్యులు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అలయన్స్ క్లబ్ కాకినాడ శరవణ కొత్త సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం కాస్మోపాలిటన్ క్లబ్‌లో సోమవారం ఘనంగా జరిగింది. 12 మందిలో అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 106-మొదటి ఉప గవర్నర్ కేవీవీ సత్యనారాయణ ప్రమాణం చేయించారు. అధ్యక్షుడిగా యాళ్ల రత్నరావు, కార్యదర్శిగా డి.రామకృష్ణ, కోశాధికారిగా దామిశెట్టి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా నడూరి సతీష్, మొదటి ఉపాధ్యక్షుడిగా యాదవిల్లి మురళీధర్, రెండో ఉపాధ్యక్షుడిగా సీహెచ్ కుటుంబరావు, మూడో ఉపాధ్యక్షుడిగా డీఎల్ శాస్త్రి, పీఆర్వోగా కేదారిశెట్టి శ్రీదేవి నియమితులయ్యారు. వీరిని అలయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ కొప్పూరి మునిరెడ్డి అభినందించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పింకే గోవిందరాజు క్లబ్ సేవా కార్యక్రమాలను అభినందించారు. అంతర్జాతీయ పూర్వ అధ్యక్షుడు బి.తిరుపతిరాజు, అలయన్ టీఎస్ఎన్ రెడ్డి, మాస్టర్ ఆఫ్ సెరిమనీ ఆర్.రవిశంకర్ పట్నాయక్, క్లబ్ చార్టర్డ్ అధ్యక్షుడు డాక్టర్ ఏపీజే విను, శరవణ క్లబ్ వ్యవస్థాపకుడు 'అలై' దిలీప్‌కుమార్ సదనాని పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 61 అర్జీలు

పిఠాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి ప్రజల నుంచి వినతిపత్రాలు, ఫిర్యాదులు స్వీకరించారు. రెవెన్యూకు 24, మునిసిపాలిటీ 16, పంచాయతీరాజ్ 6, ఇతర శాఖలకు 15 అర్జీలు వచ్చాయి. ఏపీడీ వసంతమాధవి, మునిసిపల్ కమిషనరు కనకారావు తదితరులు పాల్గొన్నారు. గొల్లప్రోలు ఊబంద కాలువ కళింగల్‌పై గల వంతెన వద్ద 5.50 అడుగుల కంటే ఎత్తులో తూరలు ఏర్పాటు చేయాలని పరగటిదొడ్డి, బలబద్రం, సీతానగరం ప్రాంతాల ఆయకట్టు రైతులు కోరారు. 4.50 అడుగుల ఎత్తులో తూరలు ఏర్పాటు చూస్తే తీవ్ర నష్టం జరుగుతుందన్నారు.

ఉచిత నేత్ర పరీక్షలు

తాళ్లరేవు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు బాప్టిస్టు చర్చిలో క్రీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఎంసీ కంటి వైద్య నిపుణులు సోమవారం 300 మంది పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. జడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్‌సాగర్ పర్యవేక్షణలో 61 మందిని కంటి ఆపరేషన్లకు గుర్తించారు. 61 మందికి సగం ధరకు కళ్లజోళ్లు అందించారు. మరో 100 మందికి షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'విద్యాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం'

కాకినాడ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. 'తల్లికి వందనం' నిధులు తమ పిల్లల చదువులకు ఎంతగానో ఉపయోగపడతాయని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం వారు గొడారిగుంటలోని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ నివాసానికి వచ్చి కృతజ్ఞతలు తెలిపారు. రూరల్ నియోజకవర్గ పరిధిలో తల్లుల ఖాతాలకు రూ.49,12,65,000 జమ చేసిన చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'తల్లికి వందనంతో ఇంటింటా వెలుగులు'

కాకినాడ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): 'తల్లికి వందనం నిధులు' ఇంటింటా వెలుగులు నింపిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ మేయర్ సుంకర పావని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకంతో తల్లుల కళ్లల్లో ఆనందం చూశామన్నారు.

'జర్నలిస్టుల పిల్లలకు 50శాతం రాయితీ ఇవ్వాలి'

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల పిల్లల చదువుకు 50 శాతం రాయితీ ఇవ్వాలంటూ కలెక్టర్ షాన్ మోహన్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. కొన్ని ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలు ఇందుకు నిరాకరించడంతో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సోమవారం కలెక్టర్‌ను కలిసి వాస్తవ పరిస్థితులను వివరించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు.

'మహా కవి శ్రీశ్రీని స్మరించుకుందాం'



శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): 'శ్రీశ్రీని స్మరించుకుందాం... ఆయన రచనలు చదువుకుందాం... ఆయన పాటలు పాడుకుందాం...' నినాదంతో నగరంలోని వివేకానంద పార్కు ఆవరణలో యూటీఎఫ్, జన విజ్ఞాన వేదిక, సాహితీ స్రవంతి తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ 42వ వర్ధంతి నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి జి.ప్రభాకరవర్మ అధ్యక్షత వహించగా ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఆర్ఎస్ జవహర్, రిటైర్డ్ ఎంపీడీవో విశ్వనాథరెడ్డి అతిథులుగా హాజరయ్యారు. శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ జవహర్, సాహితీవేత్తలు గనారా, అద్దేపల్లి ప్రభు, వేదుల శిరీష, జనార్దనస్వామి, ఐ.ప్రసాదరావు మాట్లాడారు. గాయకులు మేడిశెట్టి శ్రీరాములు, మురళి శ్రీశ్రీ పాటలు ఆలపించారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్ వెంకటరమణ, జేవీవీ ప్రధాన కార్యదర్శి జీఎస్ వర్మ, ప్రజా సంఘాల నాయకులు టి.అన్నవరం, అర్జునావు, శ్రీనివాసాచారి, మలక వెంకటరమణ, పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

'అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలి: సీపీఎం

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వితంతువులు, దివ్యాంగుల్లో అర్హులైన వారందరికీ రాష్ట్ర ప్రభుత్వ సామాజిక పెన్షన్లు మంజూరు చేయాలని సోమవారం కలెక్టర్ షాన్‌మోహన్‌కు సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే పెన్షన్‌ను రూ.వెయ్యి పెంచి 3 నెలల ఎరియర్ సహా అందించడం అభినందనీయమన్నారు. అయితే పాలన పూర్తయి ఏడాది అయినా ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయలేదన్నారు. 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్యలో పెన్షన్ తీసుకుంటూ మరణించిన కుటుంబ సభ్యులకు మాత్రమే స్పౌజ్ పెన్షన్ మంజూరుకు సచివాలయాల్లో జాబితాలు తయారు చేశారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హుల జాబితా సిద్ధం చేస్తున్నామని, ప్రభుత్వం మంజూరు చేయగానే పంపిణీ చేస్తామన్నారు. మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని ధర్నా

పిఠాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టడంలో అవకతవకలకు పాల్పడ్డ బి.కొత్తూరు ఫీల్డ్ అసిస్టెంట్‌ను తక్షణం సస్పెండ్ చేసి విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు, ఉపాధి కూలీలు సోమవారం పట్టణంలోని పాడా కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఇదే ఫీల్డ్ అసిస్టెంట్‌ను గతంలో ఒకసారి సస్పెండ్ చేశారని, 2023-24 సోషల్ ఆడిట్ రిపోర్టులో కూడా అవకతవకలకు పాల్పడినట్టు నివేదిక ఇచ్చారని తెలిపారు. ఇటీవల డ్వామా ఏపీడీ నిర్వహించిన విచారణలో లోపాలు గుర్తించారన్నారు. తక్షణం కొత్త ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని కోరారు. ఆందోళనలో దుడ్డు నాగబాబు, రాంబాబు, సత్తిబాబు, పులుగు రాంబాబు, మాగాపు రామన్నదొర, అనసూరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'తమిళం నేర్చుకుందాం' శిక్షణ ప్రారంభం

సామర్లకోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీఈఆర్టీ సూచనల మేరకు కలెక్టర్ ఆదేశాలతో జిల్లా విద్యా శాఖ ఆదేశాలతో సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 'తమిళం నేర్చుకుందాం' పేరిట వారం రోజుల ప్రత్యేక శిక్షణను డీవైఈవో వెంకటేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ మాట్లాడుతూ వారం పాటు ఎంపిక చేసిన 60 మంది విద్యార్థులకు తమిళం భాషపై శిక్షణ ఇస్తామని తెలిపారు. బహు భాషా ప్రావీణ్యం వల్ల వ్యక్తిగత ప్రయోజనంతో పాటు జాతీయ సమైక్యతా భావం ఏర్పడుతుందన్నారు. భవిష్యత్తులో వివిధ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పొందేవారికి ఈ రకమైన ఇతర భాషా అభ్యసనం ఎంతగానో దోహదపడుతుందని హెచ్ఎం సాయిరామకృష్ణ వివరించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల హెచ్ఎంలు శ్రీదేవి, శ్యాంసుందర్, ఉపాధ్యాయులు కె.గంగాభవాని, ఎన్.హరనాథ్, పీడీపీ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

'భూదాన బోర్డు భూమిలో వేసిన ఇసుక గుట్టలను తొలగించాలి'

కాకినాడ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చీడీలపొర సమీపంలోని భూదాన బోర్డు భూమిలో గనుల శాఖ అనుమతితో వేసిన ఇసుక గుట్టలను తొలగించే చర్యలు చేపట్టాలని పట్టాదారుల అధికారులకు విన్నవించుకున్నారు. ఈ మేరకు మాజీ ఎంపీటీసీ, టీడీపీ నాయకుడు రాయుడు అనిల్ పట్టాదారులతో సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ భూమిలో 15 ఏళ్ల క్రితం పేదలకు పట్టాలిచ్చారని, ఈ విషయం కోర్టులో ఉందని తెలిపారు. గత నెల గనుల శాఖ ఈ స్థలంలో ఇసుక నిల్వకు ఒక సంస్థకు అనుమతి ఇచ్చిందన్నారు. దీనిపై పట్టాదారులు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారన్నారు. స్టే ఆర్డర్ వచ్చి రెండు వారాలు అవుతున్నా ఇంకా ఇసుక గుట్టలను తొలగించలేదని అధికారులకు వివరించారు. దీనిపై తక్షణం స్పందించి గనుల శాఖకు ఫిర్యాదు పంపారని రాయుడు అనిల్ మీడియాకు తెలిపారు.



మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే చినరాజప్ప

అభినందన

సామర్లకోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్‌ను అమరావతిలోని సచివాలయంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం కలిశారు. తన నియోజకవర్గ పరిధిలోని సామర్లకోట పట్టణంలో ఐదుగురు పిల్లలున్న తల్లి ఖాతాలో 'తల్లికి వందనం' కింద రూ.65వేలు జమ కావడంతో ఆ తల్లి ఆనందం తాను కళ్లారా చూశానన్నారు. ఇందుకు మూలకారకుడైన లోకేశ్‌ను రాజప్ప అభినందించారు.

కరప ఎంఏవోగా సత్య



కరప, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కరప మండల వ్యవసాయాధికారిగా ఇమిడిశెట్టి సత్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో రైతులకు అండగా ఉంటూ మండలంలోని వ్యవసాయరంగ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సత్యను ఏడీ కె.బాబూరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

సామర్లకోట ఎంఏవోగా మురళీధర్



సామర్లకోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండల వ్యవసాయాధికారిగా వి.మురళీధర్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మండలంలోని వివిధ రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న వీఏఏలతో సమీక్షించారు. రానున్న ఖరీఫ్ వరి సాగుకు ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేసేందుకు సమష్టి కృషి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు రైతులకు అందేలా కృషి చేయాలని కోరారు.

లైబ్రరీ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో కిషోర్‌కు పీహెచ్‌డీ

కాకినాడ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని ద్రవిడియన్ విశ్వవిద్యాలయం నుంచి 'ఎన్ ఇవాల్యూయేషన్ ఆఫ్ మోడల్ ఫర్ ఏపీ ఆన్‌లైన్' అంశంపై పరిశోధనకు గాను పీఆర్కే కిషోర్‌కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) ప్రదానం చేసినట్టు గోదావరి లైబ్రేరియన్స్ సంఘ కార్యదర్శి డాక్టర్ కె.సాయిబాబు తెలిపారు. ఏయూ ప్రొఫెసర్ ఎం.సత్యనారాయణ గైడ్‌గా వ్యవహరించారన్నారు. కిషోర్ ప్రస్తుతం పూనేలోని కిర్లోస్కర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో లైబ్రేరియన్‌గా పని చేస్తున్నాడు. ఆయన్ను మేనేజ్‌మెంట్, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల పటిష్టతకు కృషి చేయాలి

కరప, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వ పాఠశాలల పటిష్టతకు కృషి చేయాలని ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి సూచించారు. మండలానికి బదిలీపై వచ్చిన 50మంది ఎస్జీటీసీ మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం ఎంఈవోకు జాయినింగ్ రిపోర్టులు అందజేశారు. వారికి ఎంఈవోతో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సాదర స్వాగతం పలికారు.

శంఖవరం ఎంపీడీవోగా లక్ష్మారెడ్డి



శంఖవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): శంఖవరం ఎంపీడీవోగా ఏ.లక్ష్మారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఐ.పోలవరం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. లాక్ష్మారెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో శర్మ సామర్లకోటకు బదిలీపై వెళ్లారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 71 అర్జీలు



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సుమారు 71 అర్జీలు స్వీకరించనట్టు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం తెలిపారు. అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, డిప్యూటీ డైరెక్టర్లు రుక్మాండయ్య, షరీఫ్, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, డీఎల్‌డీవో కె.కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, రవికుమార్, ఏపీడీ డేగలయ్య, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాత విధానంలోనే బియ్యం పంపిణీ చేయాలి

వీఆర్‌పురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో రేషన్ దుకాణాల ద్వారా కాకుండా ఎండీయూ వాహనం ద్వారా బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని వీఆర్‌పురం గిరిజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్దానిక డిప్యూటీ తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పూనెం ప్రదీప్, ఎంపీపీ కారం లక్ష్మి, కారం సుందరయ్య, సారా పాండురాజు, పొడియం శ్రీరామూర్తి తదితరులు పాల్గొన్నారు.



గిరిజన రైతులకు వరి విత్తనాలు అందిస్తున్న కూటమి నాయకులు

సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ

దేవీపట్నం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందుకూరుపేట రైతు సేవా కేంద్రం కార్యాలయంలో మండల వ్యవసాయశాఖ అధికారిణి ఆర్. ప్రశాంతి ఆధ్వర్యంలో సోమవారం గిరిజన రైతులకు కూటమి నాయకులు 90 శాతం సబ్సిడీతో వరి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ విత్తనాల కోసం రైతులు ఆధార్ పట్టాదార్ పాస్‌బుక్, రేషన్‌కార్డు జిరాక్స్ బ్యాంక్ అకౌంట్ పాసుబుక్ తీసుకుని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మరిశెట్టి వెంకటేశ్వరావు, జనసేన మండల కన్వీనర్ శారపు వెంకటరాయుడు, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి, నాయకులు బాబురావు, మట్టా మెహర్ బాబా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం డబ్బుల కోసం బ్యాంకుల వద్ద రద్దీ



కూనవరంలో ఎస్‌బీఐ మినీ బ్యాంకు వద్ద బారులుతీరిన విద్యార్థుల తల్లులు

మోతుగూడెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో సోమవారం యూనియన్ బ్యాంక్ వద్ద తల్లికి వందనం డబ్బులు కోసం బారులు తీరారు. గూడూరు, కొత్తపల్లి, చదలవాడ, మోతుగూడెం విద్యార్థుల తల్లులు యూనియన్ బ్యాంక్ వద్ద బారులుతీరడంతో సందడిగా నెలకొంది. తల్లికి వందనం డబ్బులు తీసుకుంటున్న తల్లులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు తమ పిల్లలకు మంచి భవిష్యత్ ఇస్తున్నారని ఈ డబ్బులతో తమ పిల్లలను చదివించుకోవడానికి ఉపయోగిస్తామన్నారు. తల్లికి వందనం పథకాన్ని పక్కాగా అమలు చేస్తున్నందుకు సంతోషంగా ఉందని వారు ఆనందం వ్యక్తం చేశారు.

కూనవరం, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనం సొమ్ములను అకౌంట్లో వేయడంతో బ్యాంకుల వద్ద విద్యార్థుల తల్లులతో కిటకిటలాడింది. తమ ఖాతాల్లో పడిన డబ్బులను తీసుకునేందుకు సమీప గ్రామాల నుంచి తరలివచ్చారు. కూనవరం ఎస్‌బీఐ బ్యాంకు వద్ద సోమవారం తల్లుల కోలాహలం కనిపించింది.


అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

మోతుగూడెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డొంకరాయి గ్రామంలో గ్రామ సర్పంచ్ సంధ్యారాణి అధ్యక్షతన, పంచాయతీ సెక్రటరీ మురళీ ఆధ్వర్యంలో 35 గ్రామాలకు చెందిన వివిధ వర్గాల, ప్రజలతో ప్రభుత్వ సంక్షేమం-అభివృద్ధి అంశాలపై కోదండ రామాలయ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీటీసీ కరకా వెంకటరమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభుదాసు, మాజీ ఉపసర్పంచ్ గురుమూర్తి, మెడికల్ అధికారి జ్యోతిర్మయి, సచివాలయం సెక్రటరీలు విజయలక్ష్మి, బేబి, ఉపాధి హామీ, వెలుగు, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

రంపచోడవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ధర్తీ అభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకంలో భాగంగా గిరిజన మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టినట్టు ఐటీడీఏ ఏపీవో(జీ) డీఎన్వీ రమణ అన్నారు. సోమవారం మండలంలోని చిలకమామిడి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎన్వీ రమణ మాట్లాడుతూ ఈనెల 30 వరకు గుర్తించిన 211 గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ధర్తీ అభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకంలో భాగంగా ఆయుష్మాన్ భారత్ కార్డులు, పక్కా గృహాలు, పాఠశాలల నిర్మాణాలు, వైద్య, ఆరోగ్యసేవలు, విద్యుత్, తాగునీరు సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్‌దొర, సర్పంచ్ పల్లాల భూలక్ష్మి, మాజీ సర్పంచ్ పల్లాల లచ్చిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



ఉపాధ్యాయినిలతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం నల్లగొండ గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నా రు. తొలుత [illegible]రు, పుస్తకాలు పంపిణీ, కొత్త అడ్మిషన్లపై ఉపాధ్యాయలను [illegible] తెలు[illegible].

వంతెనలు నిర్మించాలని డిమాండ్

దేవీపట్నం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ మారుమూల గ్రామాలకు (బీటీ) తారురోడ్లు వేయాలని ఆదివాసీ జేఏసీ వైస్ చైర్మన్ తెల్లం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ చిన్నపాటి వర్షానికే చెరువులా తలపిస్తున్నాయన్నారు. వాగులు, కాలువలు దాటేందుకు వంతెనలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని విద్యా వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పేదల భూములకు హక్కులు కల్పించాలి

● లిబరేషన్ కార్యకర్తల ప్రదర్శన



ప్రత్తిపాడులో లిబరేషన్ కార్యకర్తల ప్రదర్శన

ప్రత్తిపాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పేదలు సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కల్పించాలని, నిరుపేదల ఇళ్ల స్థలాలకు పట్టాలు మంజూరుచేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ లిబరేషన్ పార్టీ కార్యకర్తలు సోమవారం ప్రత్తిపాడులో సోమవారం ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. స్థానిక లిబరేషన్ పార్టీ కార్యాలయం నుంచి అల్లూరిసీతారామరాజు సెంటర్ మీదుగా ప్రదర్శన కొనసాగింది. తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తహశీల్దార్ సూర్యప్రభకు వినతిపత్రం అందజేశారు. ఈఆందోళనకు నాయకత్వం వచ్చిన రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగారావు మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు రూ.600 వేతనం ఇవ్వాలని, 200రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. జిల్లా గిరిజన సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు మాట్లాడుతూ జిల్లాలోని గిరిజన గ్రామాలకు ప్రత్యేక సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలు ఏర్పాటు చేయాలన్నారు. ఆందోళనలో లిబరేషన్ నాయకులు రాజాలరత్నం, మానుకొండ లచ్చబాబు, పేరూరి లక్ష్మి, కామిరెడ్డి నారాయణమూర్తి, తాడి నాగేశ్వరరావు, చిన్నం అర్జునరావు, అనుసూరి లక్ష్మి, మాతారాజా మణి పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌లో పేదలకు అన్నదానం



అన్నక్యాంటీన్‌లో భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో స్థానిక కాకినాడ రోడ్డులోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద నిర్వహిస్తున్న అన్నక్యాం టీన్‌లో సోమవారం టీడీపీ గోకవరం మండల నాయకుడు పల్లెల బాబి సతీమణి ప్రసన్నపుట్టిన రోజు సందర్భంగా భోజనాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై పేదలకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, గండ్రెడ్డి సన్యాసిరావు, పైలా శ్రీనివాసరావు, చిటికెల పాండు, బదిరెడ్డి వెంకటేశ్వరావు,వేములకొండ జోగారావు, యల్లమిల్లి సీఎం, దాపర్తి సీతారామయ్య, పాల్గొన్నారు.

టి.రాయవరంలో ముద్రగడ గిరి పర్యటన

ప్రత్తిపాడు, జూన్16(ఆంధ్రజ్యోతి): టి.రాయవరంలో సోమవారం వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పర్యటించారు.గ్రామనాయకులు, కార్యకర్తలు అభిమానులతో సమావేశమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. పలు బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. గ్రామపెద్దలు బత్తుల నాగార్జున, కొండ శ్రీను, ఎంపీ టీసీ రామన్నదొర పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలు విడుదల చేయాలి

ప్రత్తిపాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు రావాల్సిన పీఆర్సీ, ఏరియర్స్, డీఏ బకాయిలు మధ్యంతర భృతిలు మంజూరు చేయాలని పెన్షనర్ల అసోసియేషన్ డిమాండ్ చేసింది. ప్రత్తిపాడులో సోమవారం పెన్షనర్ల అసోసియేషన్ సమావేశానికి సంఘం అధ్యక్షుడు ముక్కుసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ భవన ఏర్పాట్లుకు స్థలం మంజూరు చేయాలని తీర్మానించారు. సమావేశంలో సంఘ నాయకులు వై. రాము, డి.సీతారాం, డి. అప్పారావు, ఎ.శేషగిరిరావు, ఎ. సుబ్బారావు, పి. వెంకటరమణ, ఎం. రాజారావు, ఎం. సుబ్రహ్మణ్యం, బి. సత్యనారాయణ, చుక్కల సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్ తీర్చిదిద్దే అంగన్‌వాడీ కేంద్రం



చిన్నారులకు పలకలు అంజేస్తున్న కౌన్సిలర్ చలమయ్య

ఏలేశ్వరం, జూన్16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతున్నారని కౌన్సిలర్ అలమండ చలమయ్య అన్నారు. సోమవారం ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి నేతృత్వంలో స్థానిక దాకమూరి సూరిబాబు కమ్యూనిటీహాల్‌లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. 40మందికి పలకలు, పుస్తకాలు అందజేశారు. సూపర్‌వైజర్ సూర్యకుమారి, మాజీ కౌన్సిలర్ బూర్లు సత్తిబాబు, కడింశెట్టి వాసు, అంగన్‌వాడీ టీచర్లు లోవలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ఏవోగా అమృత



ప్రత్తి పాడు,జూన్16(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడుమండల వ్యవసాయాధికారిగా జోకా అమృత బాధ్యతలు చేపట్టారు. కిర్లంపూడి మండల వ్యవసాయాధికారిగా పనిచేసి ఆమె బదిలీపై ఇక్కడ వచ్చారు. రైతులకు మెరుగైన వ్యవసాయ సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. అమృతను సిబ్బంది సన్మానించారు. ఇక్కడ వ్యవసాయాధికారిగా పనిచేసిన వైవీ గంగాధర్‌గా పిఠాపురం వ్యవసాయాధికారిగా బదిలీ అయ్యారు.

వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రత్తిపాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు పాదాలమ్మ గుడి వద్ద వృద్ధాశరణంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చట్టపరంగా సీనియర్ సిటిజన్లకు లభించే హక్కులను బార్ అసోసియేషన్‌కు చెందిన బుగతా శివ, బొంగుళూరు మధుబాబు వివరించారు. అల్పాహార కిట్లు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ యాళ్ల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలేశ్వరుడికి విశిష్ట పూజలు



ప్రత్తిపాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాచపల్లి అడ్డరోడ్డు వద్ద ఉన్న అపీల కుంచాంబ సమేత అరుణాచలేశ్వరుడికి విశిష్ట పూజలు నిర్వహించారు. స్వామి,అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు చేసి పలు రకాల పూలతో విశిష్ట అలంకరణలు చేశారు. రమణ ఆశ్రమ నిర్వాహకుడు రమణానంద స్వామి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామి,అమ్మవార్లకు కుంకుమార్చనలు, లలిత సహస్ర పారాయణాలు, పంచహారతులు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఆశ్రమ నిర్వాహకులకు, భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఎస్‌టీవోగా వెంకటనారాయణ



ప్రత్తిపాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సబ్‌ట్రెజరీ అధికారిగా వై. వెంకటనారాయణ బాధ్యతలు చేపట్టారు. ఆయన అమలాపురం ఎస్‌టీవోగా పనిచేసి బదిలీపై ఇక్కడ వచ్చారు. ఇక్కడ ఎస్‌టీవోగా పనిచేసిన ఖాన్ అమలాపురం ఎస్‌టీవోగా బదిలీ అయ్యారు. వెంకటనారాయణను ప్రభుత్వ శాఖల అధికారులు, పెన్షనర్లు, ఉపాధ్యాయులు కలిసి అభినందించారు.

తీరు మారకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా

మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం



సమావేశంలో వైద్య సిబ్బందిపై మండిపడుతున్న దృశ్యం

కోటనందూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కోటనందూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీను అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో సభ్యులు మాట్లాడారు. ఇటీవల అల్లిపూడి కి చెందిన రైతు పాము కాటుకు గురై మధ్యాహ్నా సమయంలో అసుపత్రికి రాగా ఎవరు స్పందించలేదని, సిబ్బంది ఎవరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాడని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. తీరు మార్చుకోకపోతే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. రైతులకు అధిక దిగుబడి ఇచ్చే వరి విత్తనాలను ఇవ్వాలని సభ్యులు కోరారు. దీనిపై వ్యవసాయదికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ పూర్తిస్థాయిలో విత్తనాలు కొనుగోలు చేస్తామని తెలిపారు. ఎంఈవో రామశేఖర్ మాట్లాడుతూ మండలంలో అర్హులందరికీ తల్లికి వందనం డబ్బులు పడ్డాయిన్నారు. ఎంపీడీవో వెంకట నారాయణ, డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, డాక్టర్ కావ్య తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి



మెప్మా కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్లకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనలో మెప్మా కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్లు భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పిలుపునిచ్చారు. పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయం వద్ద సోమవారం మెప్మా కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్లకు ఉచితంగా ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక, సాంకేతిక, ఆరోగ్యం, సామాజికాభివృద్ధి సేవలను మరింత విస్తృతపరిచేందుకు రిసోర్స్‌పర్సన్లు ట్యాబ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్‌హెచ్‌జీ, ఎస్ఎల్ఎఫ్ గ్రూపుల నిర్మాణం, ఆధార్‌సీడింగ్, బ్యాంక్‌లింకేజీ, స్త్రీ నిధి, వడ్డీలేని రుణాలకు ఈట్యాబ్‌లు ఎంతో ఉపయోగపడతాయని ఏలేశ్వరం మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు.

కూటమి పాలనలోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు

మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

గండేపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలోనే అభి వృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. సోమవారం మండల గ్రామ శివారులో ఉన్న పరిణయ ఫంక్షన్ హాల్‌లో సోమవారం మార్కెట్ కమిటీ అధ్యక్ష ఎన్నిక జరిగింది. మార్కెట్ కమిటీ అధ్యక్షుడుగా అడపా భరత్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా బొదిరెడ్డి శ్రీను, డైరెక్టర్లగా గండేపల్లి మండలానికి చెందిన సుంకవిల్లిరాజు, మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి వెంకటలక్ష్మి, పలువురు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, నెహ్రూ, నవీన్ హాజరయ్యారు. టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్, జాస్తి వసంత్, బొల్లంరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

'సాగునీరిస్తారో లేదో రైతులకు చెప్పాలి'

జగ్గంపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో 42వేల ఎకరాల భూమి పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి సాగునీటిని ఇస్తారా లేదో రైతులకు చెప్పాలని సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర డిమాండ్ చేశారు. 2023లో జరిగిన పంటలకు పెట్టుబడి పెట్టిన తరువాత నీరు ఇవ్వకపోవడం వల్ల 30వేల ఎకరాల్లో పంటలు పూర్తిగా ఎండిపోయి రైతన్నలు అప్పులు పాలయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతన్నలకు పూర్తిస్థాయిలో నీరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పుష్కర పంపు హౌస్ రూ.50కోట్ల నిధులతో పైపులైన్ మారుస్తానని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈమాట నేటికీ నెరవేరలేదని విమర్శించారు. తక్షణం సాగునీరు ఇచ్చి పుష్కర ఎత్తిపోతల పథకం కింద ఆయకట్టు రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు: సీఐ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వైఆర్‌కె శ్రీనివాస్

జగ్గంపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ హెచ్చరించారు. జగ్గంపేట హైస్కూల్లో సోమవారం విద్యార్థులకు ర్యాగింగ్ నివారణ, రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు శక్తి యాప్, మహిళా రక్షణ, ఈవ్‌టీజింగ్, యాంటీ ర్యాగింగ్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల భద్రత, రక్షణ విషయంలో సమస్య ఉంటే సీఐ 9440796529, ఎస్ఐ 9440796569 తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రఘునాథరావు, హెచ్ఎం టీవీఎస్ రంగారావు, ఐసీ హెచ్ఎం బేగం, బీఎస్ఎన్ మూర్తి, వి.నరసింహమూర్తి, పీడీజి నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



లోవలో వసతి గదుల నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్ఐ

తుని రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తలుపులమ్మ లోవ ఆలయ వసతి గదుల నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవ ని రూరల్ ఎస్ఐ కృష్ణమాచార్యులు హెచ్చరించారు. రానున్న ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఆయన ప్రైవేట్ కాటేజ్‌ల నిర్వాహకులతో సమావేశమై పలు సూచనలిచ్చారు.

తునిలో యోగాంధ్ర కార్యక్రమం



తునిరూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): యోగాతో దీర్ఘకాలిక రుగ్మతలు దూరమవుతాయని యోగా గురువు కేఎస్ఎన్ మూర్తి తెలిపారు. తుని ఆర్టీసీ డిపో ఆవరణలో యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మారుతీరావు మృతి



కోటనందూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బిళ్లనందూరు గ్రామ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ మాతిరెడ్డి మారుతీరావు అనారోగ్యంతో మృతిచెందారు. టీడీపీలో ఉంటూ రెండుసార్లు సర్పంచ్‌గా చేసి పలు పదవులు చేపట్టారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. మాతిరెడ్డి చిత్రపటానికి టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు, అంకంరెడ్డి రమేష్, డి చిరంజీవిరాజు, షేక్ నవాబ్‌జానీ, చిటికెల సత్యనారాయణ, వెలగా వెంకటకృష్ణారావు, పోతల సూరిబాబు, పెనుముచ్చు నాగేశ్వరరావు, గొర్లి అచ్చియ్యనాయుడు పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు.

రేపు 'డయల్ యువర్ డీఎం'

ఏలేశ్వరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ డిపో కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్టు ఏలేశ్వరం డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ తెలిపారు. ప్రయాణికులు తమ సూచనలు, సలహాలు తెలిపేందుకు 995922 5532లో మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు సంప్రదించాలని కోరారు.

శాసనమండలి చైర్‌పర్సన్‌ను కలిసిన ముదునూరి



ప్రత్తిపాడు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును ధర్మవరానికి చెందిన నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ వైసీపీ పరిశీలకుడు, ఎంఎంఆర్ చారిటబుట్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు కలిశారు. సోమవారం భీమవరంలో వెళ్లి చైర్మన్ స్వగృహంలో కలిసి శాలువాకప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

తుని మండల పరిషత్ ఏవోగా ప్రసాద్



ఆర్డర్ కాపీని ఎంపీడీవోకు అందజేస్తున్న దృశ్యం

తుని రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తుని మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా టీఆర్ఎస్ ప్రసాద్ విధుల్లోకి చేరారు. ఎంపీ డీవో సాయి నవీన్‌ను కలిసి నియామకపత్రం అందజేశారు. ఆయన కాకినాడ జడ్పీ కార్యాలయం నుంచి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

తహశీల్దార్‌కు సన్మానం



కోటనందూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బదిలీపై కోనసీమ జిల్లా ముమ్మడివరం మండలానికి వెళ్లిన తహశీల్దార్ సుభాష్‌ను రెవెన్యూ, ఎంపీడీవో, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో వెంకట నారాయణ, డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, అర్ఐ గీత, డీలర్ల సంఘం అధ్యక్షుడు జోగిరాజు, సూరిబాబు, కర్రి సత్యనారాయణ,రాజా, అన్నంరెడ్డి ఉదయ్‌కుమారి కిరణ్, ఫణి పాల్గొన్నారు.

'తల్లికి వందనంతో వెలుగులు'

కాకినాడ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): 'తల్లికివందనం నిధులు' ఇంటింటా వెలుగులు నింపిందని మాజీ మేయర్ సుంకర పావని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈపథకంతో తల్లుల కళ్లల్లో ఆనందం చూశామన్నారు.